RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 30 సెప్టెంబర్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:105

# తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి

**పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయండి**

**కృష్ణా జలాల వినియోగంపై త్వరగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి**

**జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వినతి**



ఢిల్లీ: తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు.

ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ం152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు.

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ. 4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వేచేసి మా భూములు మాకు ఇప్పించండి

**ధరణి పేరిట రికార్డులు తారుమారు చేసి మా భూములను ఎర్రవెల్లిలోని సర్వేనెంబర్ 325లో కలిపారు**

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి శివారు వెంకటాపూర్ గ్రామస్థుల వేడుకోలు**

**శివారు వెంకటాపూర్ భూ సమస్యపై సమగ్ర విచారణకు హామీ**

**రికార్డులు, గ్రామ నక్షా, క్షేత్రస్థాయి సర్వేతో వాస్తవాలు తేలుస్తాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్: సిద్దిపేట జిల్లా గజ్వేలు నియోజకవర్గంలోని మార్కూక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని రైతులు మంత్రికి విన్నవించిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2 లో

**వైసీపీ ఐదేళ్ల కంటే.. ఈ రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం**

**పల్లె పండుగ 1.0, 2.0తో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు** 3 లో

# సీడబ్ల్యూసీ సమావేశానికి ముందు.. రేవంత్, డీకే శివకుమార్ లతో రాహుల్ ముచ్చట్లు




# తెలంగాణ ఆరెకటికల ఆశా కిరణం- కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ (కటిక్)

**చిన్న కార్యకర్త నుండి ఉన్నత శిఖరాలను చేరుకొని కటిక సమాజ కీర్తిని చాటి చెప్పిన మా కుల బంధువు- కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ (కటిక్)**

న్యూఢిల్లీ 29/09/26 మంగళవారం చిన్న కార్యకర్త నుండి ఉన్నత శిఖరాలను చేరుకుని 8సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఘన విజయం సాధించి. మూడుసార్లు నరేంద్ర మోడీ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా మచ్చలేని మహారాజు గా పేరు ప్రతిష్టలను సంపాదించి, మా కులం కటిక్ సమాజ కీర్తిని దేశవ్యాప్తంగా తెలిసే విధంగా దేశ ప్రజలకు నిస్వార్థ సేవలు చేస్తూ వస్తున్న మా కుల బాంధవుడు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్(కటిక్) ను నిఘానేత్రం దినపత్రిక పబ్లిషర్, కోయల్ కార్ రామ్ దయానంద్ (కటిక్) వారిని కలవడం జరిగింది. కేంద్ర మంత్రివర్యులను కలిసినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. వారు ఎన్నో విషయాలపై చర్చించి





తెలంగాణ రాష్ట్ర కటిక కుల బాంధవుల గురించి తెలుసుకున్నారు. కుల బంధువుల యొక్క సధక బాధాకాలను గురించి వివరంగా తెలుసుకొని తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కటిక సమాజం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య బీసీ నుండి ఎస్సీ జాబితాలోకి మన తెలంగాణ కటిక సమాజాన్ని ఎలాగైనా ఎస్సీ జాబితాలోకి తీసుకు రావలసిందిగా వారిని కోరగా వారు సానుకూలంగా స్పందించి ఎస్సీ జాబితాలోకి చేర్చే విషయంపై నా పరిధిలో ఉన్నంతవరకు నా సాయ శక్తుల ప్రయత్నం చేస్తానని మన తెలంగాణ రాష్ట్ర కటిక సమాజానికి న్యాయం జరిగే విధంగా చూస్తానని వారు తెలిపారని కోయల్ కార్ రామ్ దయానంద్ (కటిక్) తెలిపారు

# దళిత--ఆదివాసీల ఐక్యతతోనే సామాజిక ప్రగతి: ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**ఆర్ఎస్ఎస్, మనుస్మృతి సిద్ధాంతాలపై ఎంపీ విమర్శలు**



ప్రజాబలం

30 సెప్టెంబర్ 2026 బుధవారం

# తెరపైకి సూట్ కేసు పార్టీలు

ఇప్పటి వరకు సూట్ కేసు కంపెనీలనే చూశాము... ఇప్పుడు సూట్ కేసు పార్టీలు కూడా వచ్చేవాయి..కాగితాలకే పరిమితమైన కొన్ని పార్టీలకు విరాళాల రూపంలో వందల కోట్ల నిధులు అందుతున్న విషయం మూడు వారాల కిందట వెలుగులోకి వచ్చింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో సీఐడీ క్రైమ్ పోలీసులు తాజాగా ఇటువంటి పార్టీలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గుజరాత్‌లోని ఆరు చిన్న పార్టీలు 2023-24లో 1700 కోట్ల రూపాయల విరాళాలు అందుకున్నట్టు పరిశోధనలో తేలింది. ఈ మొత్తం బీజేపీ మినహా అన్ని జాతీయ పార్టీల మొత్తం ఆదాయానికి కంటే ఎక్కువ.భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని 173 సెక్షన్ ప్రకారం ఈ రాజకీయ పార్టీలపై కేసులు నమోదు చేశారు.ఆదాయపు పన్ను శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు ఆరు పార్టీల్లో కనీసం మూడింటిపై పోలీసు కేసులు నమోదు అయ్యాయి.భారతీయ నేషనల్ జనతా దళ్, గరీబ్ కల్యాణ్ పార్టీ, స్వతంత్ర అభివ్యక్తి పార్టీలపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. స్థానిక గుజరాతీ వార్తా పత్రికల ప్రకారం సత్యవాది రక్షక్ పార్టీ అనే నాల్గో పార్టీపై కూడా ఎఫ్ఐఆర్ రిజిస్టర్ అయ్యింది. అయితే దీనికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ వద్ద లేకపోవడంతో నిర్ధరించలేకపోతోంది.'ఈ కేసులో రెండు పార్టీలు అహ్మదాబాద్‌కు చెందినవికాగా, మరొకటి గాంధీనగర్‌కు చెందింది' అని గాంధీనగర్ సీఐడీ క్రైమ్ విభాగం అధికారి ఒకరు చెప్పారు.ఈ కేసులో అరెస్టులు ఏమైనా జరిగాయా అని అడగగా, ' ఇప్పటి వరకు ఒక్కర్ని కూడా అరెస్టు చేయలేదు, దర్యాప్తు కొనసాగుతోంది' అని చెప్పారు. గాంధీనగర్ కేంద్రంగా నడుస్తున్న భారతీయ నేషనల్ జనతా దళ్, దానితో సంబంధం ఉన్న నలుగురిపై సీఐడీ క్రైమ్ విభాగం కేసు నమోదు చేసింది.ఈ పార్టీ 2019-20 నుంచి 2024-26 వరకు 1,143 కోట్ల నిధులు అక్రమ పద్ధతిలో స్వీకరించిందని, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు 343 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లినట్టు అభియోగాలు మోపారు."నిందితులంతా కుమ్మక్కై నకిలీ పత్రాలు సృష్టించి వాటినే అసలైన పత్రాలుగా పేర్కొంటూ తప్పుడు విరాళాల నివేదికలను(ఫారం 24ఏ) ఎన్నికల సంఘానికి సమర్పించారని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు 343 కోట్లరూపాయల నష్టం వాటిల్లిందని" ఎఫ్ఐఆర్‌లో పోలీసులు వెల్లడించారు."ఈ కేసులో నిందితులు కుట్రపూరితంగా బోగస్ విరాళాలు చూపించి మోసానికి పాల్పడ్డారని ప్రాథమిక విచారణలో తేలింది. పన్నులు ఎగవేసే లక్ష్యంతో కమిషన్ ఏజెంట్ల ద్వారా నిధులు సేకరించి ఆర్టీజీఎస్ బ్యాంకింగ్ ఛానల్ ద్వారా ఐదు బ్యాంకు ఖాతాలకు నిధులను బదిలీ చేశారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది""విరాళ దాతలకు నకిలీ డొనేషన్ స్లిప్స్, డబ్బులు డిపాజిట్ చేసినట్టు నకిలీ రసీదులు నిందితులు అందజేసేవారు. దీంతో ఆ దాతలకు ఆదాయపు పన్ను చట్టంలోని 80జీజీబీ, 80జీజీసీ కింద తప్పుడు మార్గంలో వంద శాతం పన్ను మినహాయింపును పొందే అవకాశం లభించేది" అని పోలీసులు తెలిపారు.బీఎన్‌జేడీ జాతీయ అధ్యక్షుడు గజేరాతో పరిశోధనలో భాగంగా మాట్లాడినప్పుడు తాము ఏ తప్పు చేయడం లేదని చెప్పారు.'పార్టీ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవడానికి లేదు. డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎటు వెళ్తున్నాయో ఆదాయపు పన్ను శాఖకు తెలుస్తుంది' అని పేర్కొన్నారు. స్వతంత్ర అభివ్యక్తి పార్టీ 2023-2025 మధ్య 519 కోట్ల రూపాయల మోసానికి పాల్పడినట్టు పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ పత్రాలు సృష్టించి, అవే అసలైనవిగా భారత ఎన్నికల సంఘానికి నివేదికలను సమర్పించారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు 150 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఆ పార్టీకి వచ్చిన మొత్తం నిధుల్లో ఇది 30 శాతానికి సమానం. దీంతో ఆ పార్టీపై, ఆపార్టీతో కలిసి పని చేస్తున్న వారిపై ఆర్థిక మోసం, విశ్వాస ఘాతుకానికి పాల్పడిన ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అహ్మదాబాద్‌లోని నరోదా ప్రాంతంలో మహవీర్ నగర్ కల్యాణ్ మిల్‌కు ఎదురుగా ఉన్న షాప్ నెంబర్ 2లో స్వతంత్ర అభివ్యక్తి పార్టీ కార్యాలయం ఉంది.స్వతంత్ర అభివ్యక్తి పార్టీకి చెందిన పన్ను సలహాదారుడు మెహుల్ కుమార్ మహేష్ కుమార్ ఖాత్రీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర పర్షోత్తం తివారీ, చార్టర్డ్ అకౌంటెంట్ మయూర్ సింగ్ రాథోడ్‌తోపాటు ఇతర కార్యనిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.విరాళాలు తిరిగి ఇచ్చినట్టు చెప్పుకుంటున్న మెహుల్‌కుమార్ మహేష్‌కుమార్ ఖాత్రి మొబైల్ ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లో విరాళాలు ఇచ్చిన రాజకీయ నాయకుల పేర్లు లభించినట్టు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. ఈ జాబితాలో స్వతంత్ర అభివ్యక్తి పార్టీకి లభించిన నకిలీ విరాళాల వివరాలు ఉన్నాయి.ప్రాథమిక దర్యాప్తులో నిందితుల నుంచి తీసుకున్న వాంగ్మూలాల ద్వారా అతిపెద్ద, వ్యవస్థాగత రాజకీయ విరాళాల కుంభకోణం బయటపడింది" అని ఎఫ్ఐఆర్‌లో తెలిపారు.ఈ స్వతంత్ర అభివ్యక్తి పార్టీ దేశంలోని వివిధ పన్ను చెల్లింపులదారుల నుంచి చెక్కు లేదా బ్యాంకింగ్ బదిలీ ద్వారా రాజకీయ విరాళాలను స్వీకరించింది. ఈ విరాళాల ఆధారంగా సెక్షన్ 80 జీజీబీ ప్రకారం చాలా మంది పన్ను చెల్లింపుదారులు తప్పుడు మార్గంలో పన్ను మినహాయింపు పొందారు. 8 నుంచి 9 శాతం కమిషన్‌గా తీసుకున్న తర్వాత మిగతా సొమ్మును క్యాష్ రూపంలో విరాళం ఇచ్చిన వారికి అందజేస్తారు." అని పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు లేవని, కేవలం కమిషన్ల కోసం, తప్పుడు లెక్కల కోసమే పార్టీ ఏర్పాటు చేసినట్టు స్వతంత్ర అభివ్యక్తి పార్టీ అధ్యక్షుడు సురేంద్ర తివారీ వాంగ్మూలం ఇచ్చినట్టు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు.సురేంద్ర తివారీ నేతృత్వంలోని పార్టీ 2023-24లో 219 కోట్ల రూపాయలను విరాళాల రూపంలో స్వీకరించారు. పార్టీకి వచ్చిన విరాళాల గురించి తనకు తెలియదని, సీఏ, మయూర్ సింగ్ తనను తప్పుదారి పట్టించారని సురేంద్ర తివారీ చెప్పారు.ఈ ఆరోపణలను మయూర్ సింగ్ ఖండించారు. తాను ఏ పార్టీనీ నడపడం లేదని, వివిధ పార్టీలకు ఎన్నికల సంఘం వద్ద ట్యాక్స్ ఫైలింగ్ మాత్రమే చేస్తున్నట్టు చెప్పారు. అందులో న్యూ ఇండియన్ యూనైటెడ్ పార్టీ కూడా ఉందని పేర్కొన్నారు.'అంతా ఒకేరకమైన మనుషులే, మీకు అర్థమవుతోంది కదా, ఇక్కడ పార్టీలు ఇళ్లలోనే నడుస్తాయి'అని ఆయన అన్నారు.స్వతంత్ర అభివ్యక్తి పార్టీసహా సురేంద్ర తివారీ, మయూర్ సింగ్, మెహుల్ కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది.గరీబ్ కల్యాణ్ పార్టీ, అందులో పని చేస్తున్న 8 మందిపై సీఐడీ క్రైమ్ విభాగం కేసు పెట్టింది. ఈ పార్టీ అహ్మదాబాద్‌లోని నానా చిలోదా ప్రాంతం ఉన్న శ్రీనాథ్ షాపింగ్ సెంటర్ ఏ-203లో నడుస్తోంది.ఈ పార్టీ 2022- 2026 మధ్య 206 కోట్ల రూపాయల కంటే ఎక్కువ నిధులు స్వీకరించి అక్రమాలకు పాల్పడినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.దీని వల్ల కూడా ప్రభుత్వ ఖజానాకు 62 కోట్ల రూపాయల కంటే ఎక్కువ నష్టం వాటిల్లింది. ఇది ఆ పార్టీ స్వీకరించిన మొత్తం నిధుల్లో 30 శాతం. దీంతో ఆ పార్టీ, ఆ పార్టీలో పని చేస్తున్న వారిపై ఆర్థిక మోసానికి పాల్పడారనే కేసు నమోదు అయ్యింది.గరీబ్ కల్యాణ్ పార్టీ అక్రమ విరాళాలు స్వీకరించించినట్టు సేకరించిన గణాంక సమాచారం ఆధారంగా ఆదాయపు పన్ను శాఖ ఆ పార్టీ కార్యాలయంలో తనిఖీలు చేసింది. దీని ఆధారంగా లభించిన ఆధారాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# దళిత--ఆదివాసీల ఐక్యతతోనే సామాజిక ప్రగతి: ఎంపీ గడ్డం వంశీకృష్ణ

## ఆర్ఎస్ఎస్, మనుస్మృతి సిద్ధాంతాలపై ఎంపీ విమర్శలు

న్యూఢిల్లీ: దళిత, ఆదివాసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే సామాజిక ప్రగతి సాధ్యమవుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. దళిత--ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కులు, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో కాంగ్రెస్ రాజ/సా ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన లి"దళిత--ఆదివాసీ సెల్ఫ్-రెస్పెక్ట్ మీటింగ్"లికు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా దళిత, ఆదివాసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం తదితర అంశాలపై చర్చించారు.

విభజించి పాలించే సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఐక్యత

సమావేశంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్, మనుస్మృతి సిద్ధాంతాలు దేశాన్ని విభజించి పాలించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా దళితులు, ఆదివాసీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఐక్యంగా నిలవాలని అన్నారు.

సమాజాన్ని కులాలు, వర్గాలుగా విభజించడం వల్ల అణగారిన వర్గాల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని, అందువల్ల పరస్పర ఐక్యతను బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించాలి

ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ వర్గాల జనాభా, బడ్జెట్ కేటాయింపుల అంశాన్ని కూడా ఎంపీ ప్రస్తావించారు. "దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ వర్గాల జనాభా 30 శాతం ఉన్నప్పుడు, బడ్జెట్ కేటాయింపులు కేవలం 3 శాతం మాత్రమే ఎందుకు?" అని ప్రశ్నించారు.

జనాభాలో గణనీయమైన వాటా ఉన్నప్పటికీ తమ వర్గాలకు తగిన స్థాయిలో నిధులు, అవకాశాలు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన, అణచివేతకు గురైన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

అన్యాయంపై పోరాడాలి

దళిత, ఆదివాసీ సమాజాలకు సమాన అవకాశాలు, న్యాయమైన వాటా లభించేలా ప్రజాప్రతినిధులు పోరాడాలని వంశీకృష్ణ అన్నారు. హక్కుల పరిరక్షణతో పాటు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి కూడా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

దళిత--ఆదివాసీ వర్గాల ఐక్యతే వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రగతికి బలమని, అణచివేతకు గురవుతున్న వర్గాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు.

# సర్వేచేసి మా భూములు మాకు ఇప్పించండి



మొదటి పేజీ తరువాయి

సోమవారం సచివాలయంలో శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శివారు వెంకటాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 38, 41, 47, 85, 88, 100లోని దాదాపు 134 ఎకరాల వ్యవసాయ భూముల్లో తమ తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా తమ భూములపై హక్కులు లేకుండా చేశారని, తమ పొలాలు తమకు కాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, గ్రామ నక్షా పటాలను కూడా రైతులు మంత్రికి చూపించారు. ఆనాటి ప్రభుత్వంలో అధికారులు కొత్త పాస్‌బుక్కులు ఇస్తామని చెప్పి తమ వద్ద ఉన్న పాత పాస్‌బుక్కులను తీసుకున్నారని, అయితే కొత్త పాస్‌బుక్కులు ఇవ్వకుండా తమను మోసం చేశారని వారు మంత్రికి వివరించారు.

ఆనాటి ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం ఎర్రవెల్లిలోని సర్వే నంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ సమగ్ర సర్వే నిర్వహించి, గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, రికార్డులు--పాత పాస్‌బుక్కులు--గ్రామ నక్షా--క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరికి చెందిన భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని మంత్రికి వివరించారు.

అదేవిధంగా దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా పాండురంగా రిజర్వాయర్‌లో విలీనం చేశారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం, భూముల మ్యాపింగ్, రికార్డుల మార్పుల కారణంగా తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలను విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం. ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని మంత్రి హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్, సర్వే ఠ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# సీడబ్ల్యూసీ సమావేశానికి ముందు..

## రేవంత్, డీకే శివకుమార్ లతో రాహుల్ ముచ్చట్లు

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముందు, ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ లతో కొద్దిసేపు ముచ్చటించారు.

సీడబ్ల్యూసీ సమావేశానికి ముందు వారు నిలుచుని ముచ్చటించుకుంటున్నట్లుగా ఉన్న ఫొటోను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. ఈ సంభాషణలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, శివకుమార్‌తో పాటు కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు.

కాగా, సీడబ్ల్యూసీ సమావేశంలో పలు జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించినట్లు రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన సామాజిక, ఆర్థిక వ్యూహాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. అదే సమయంలో, భారతీయ జనతా పార్టీ (బీజేపీ), ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల ప్రక్రియ సమగ్రతను దెబ్బతీస్తున్నాయన్న ఆరోపణలపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించారు.



# వైసీపీ ఐదేళ్ల కంటే.. ఈ రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం

# పల్లె పండుగ 1.0, 2.0తో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు

**100 రెట్లు ఎక్కువగా మినీ గోకులాలు**

**బ్లీచింగ్ పౌడర్ కొనలేని స్థితి నుంచి.. సొంతంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీలను తీసుకొచ్చాం**

**ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 6,500 కి.మీ. సీసీ రోడ్ల నిర్మాణం**

**అడవి తల్లిబాటలో 1,500 కి.మీ.కు పైగా రహదారుల నిర్మాణం**

**గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ 3.0**

**పల్లె పండుగ 3.0లో 6 వేల కి.మీ. సీసీ రోడ్లు, 9,500 కి.మీ. బీటీ రోడ్లు**


**22,500 మినీ గోకులాలు.. 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ అభివృద్ధికి భారీ కార్యాచరణ ప్రజల భాగస్వామ్యంతోనే పారదర్శక గ్రామీణ అభివృద్ధి**

**అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రజల పర్యవేక్షణ అవసరం**

**ఉదయగిరి వేదికగా రూ.11,085 కోట్ల పల్లెపండుగ 3.0కు శ్రీకారం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలిసి పనులు ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**






'పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా, ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రహదారులు, తాగు నీరు, వ్యవసాయం, ఉపాధి, పరిశుభ్రత, మౌలిక వసతులతోపాటు పర్యాటక రంగానికీ ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో 'పల్లె పండుగ 3.0'కు శ్రీకారం చుట్టామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పల్లె బలపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుందనే సంకల్పంతో ప్రతి పల్లెను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పల్లెపండుగ 3.0 కార్యక్రమం ద్వారా 11,085 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఈ రెండున్నరేళ్లలో పల్లెపండుగ, జలజీవన్ మిషన్ – అమరజీవి జలధార, 15వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగం, 10 వేలకుపైగా పదోన్నతులు, డి.డి.ఒ. కార్యాలయాల ఏర్పాటు.. ఇలా ఎన్నో సంస్కరణలతో ఒకవైపు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తూనే, మరోవైపు వ్యవస్థను బలోపేతం చేశాం. ఒకప్పుడు పంచాయతీలు బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి నుంచి, ఇప్పుడు తమ గ్రామానికి అవసరమైన పనులను తామే నిర్ణయించుకుని, తమ గ్రామ అభివృద్ధికి తామే ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీ రాజ్ వ్యవస్థను తీసుకొచ్చాం.గత ఐదేళ్ల కంటే రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణంగత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కి.మీ. సీసీ రోడ్లు నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం ద్వారా కేవలం రెండేళ్లలోనే దానికి 10 రెట్లు ఎక్కువగా, దాదాపు 9,000 కి.మీ. సీసీ రోడ్లను పూర్తి చేశాం. తంలో 304 మినీ గోకులాలు మాత్రమే నిర్మిస్తే, మనం దాదాపు 100 రెట్లు ఎక్కువగా, 30 వేలకు పైగా మినీ గోకులాలను నిర్మించాం. అలాగే, పల్లెపండుగ ద్వారా 13,326 గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో భాగంగా 1 లక్ష 15 వేల పంట కుంటలను నిర్మించడంతోపాటు, 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేశాం. మరోవైపు, 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. మన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఇతర కాలనీల్లో 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లను ఇప్పటికే పూర్తి చేసింది. గిరిజన గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మరింత మెరుగుపరచేందుకు అడవితల్లిబాట కార్యక్రమం కింద రూ.2,180 కోట్ల వ్యయంతో సుమారు 2,437 కిలోమీటర్ల రహదారులను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇందులో ఇప్పటికే 1500 కిలోమీటర్లకు పైగా అనుసంధాన రహదారులను నిర్మించాం. అలాగే, ఇప్పటివరకు రోడ్డు అనుసంధానం లేని బంజారా, యానాది, ఎరుకుల గిరిజన ఆవాసాలు ఉన్న ప్రాంతాల్లో, పల్లెపండుగ ద్వారా 167 ఆవాసాలకు 111.4 కి.మీ. మేర రహదారి సౌకర్యం కల్పించాం.

పల్లెపండుగ 3.0తో గ్రామీణ ప్రగతికి కొత్త ఊపుఈ రోజు ఇక్కడ మనం రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా, గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ అభివృద్ధిని పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లబోతున్నాం. రూ.50 వేల కోట్లతో పల్లెపండుగ, జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయబోతున్నాం. ఇందులో రూ.30 వేల కోట్లతో అక్టోబర్ 5న గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారితో కలిసి జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా మల్టీ విలేజ్ స్కీమ్, సింగిల్ విలేజ్ స్కీమ్ పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నాం. అలాగే రూ.9 వేల కోట్లతో పల్లెపండుగ 1.0, 2.0 కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి, ఈ రోజు రూ.11,085 కోట్లతో ప్రతిష్టాత్మకంగా పల్లెపండుగ 3.0ను ప్రారంభిస్తున్నాం. ఇందులో భాగంగా 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, మరో 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయబోతున్నాం. అలాగే, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. పైలెట్ ప్రాజెక్ట్ గా డొంక రోడ్ల అభివృద్ధి ఎన్నో ఏళ్లుగా రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు డొంక రోడ్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రతి నియోజకవర్గంలో ఒక డొంక రోడ్డును అభివృద్ధి చేయబోతున్నాం. ఆ తర్వాత 161 గ్రామీణ నియోజకవర్గాల్లో డొంక రోడ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రైతులు తమ పంటలను సులభంగా మార్కెట్‌కు తీసుకెళ్లేలా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచబోతున్నాం. ఉదయగిరి ఇక అభివృద్ధి బాటలోశ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనే దాదాపు రూ.520 కోట్లతో పల్లెపండుగ పనులు చేపట్టాం.

ఇంకా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. మన ఉదయగిరిలోనే పల్లెపండుగ ద్వారా రూ.121 కోట్లతో 115 కి.మీ. మేర సీసీ, బీటీ రోడ్లు, 1,200కు పైగా నీటి కుంటలు, 348 గోకులాలు, 190కి పైగా నీటి తొట్లు, సుమారు 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు వంటి అభివృద్ధి పనులను పూర్తి చేశాం. ఉదయగిరి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, గతంలో నిలిచిపోయిన సుజల శ్రవంతి పథకం ద్వారా రూ.52 కోట్లతో, దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 381 పనులు చేపట్టబోతున్నాం. ఉదయగిరి కోటకు చేరుకునే మార్గంలో సుమారు 4 కి.మీ. రహదారిని రూ.2.5 కోట్లతో మంజూరు చేస్తున్నాం. దీనికి అవసరమైన అటవీ శాఖ అనుమతులను త్వరగా పొందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశిస్తున్నాను. ఉదయగిరి కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసి, స్వదేశీ దర్శన్, సాస్కీ పథకాల ద్వారా అవసరమైన నిధులు సమకూర్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అలాగే, ఉదయగిరి కొండను హెరిటేజ్ టూరిజం ప్రాంతంగా, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఉదయగిరిలో ఇప్పటికే క్రాఫ్ట్ ఉడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి, వేప, బిక్కి, కల్ది, పాలబర్క్ వంటి చెక్కలను అందుబాటులోకి తీసుకొచ్చాం. చెక్క స్పూన్లు, గిన్నెలు, చెక్కబొమ్మల తయారీలో ప్రసిద్ధి చెందిన స్థానిక కళాకారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే, వారు తమ ఉత్పత్తులను తయారు చేసుకునేందుకు అనుగుణంగా సొసైటీ భవనాల మరమ్మతు పనులు చేపడుతున్నాం. త్వరలో శాశ్వత భవనాలను కూడా నిర్మించబోతున్నాం

## తుగ్గలి బీసీ కాలనీ ప్రధాన రహదారికు మహర్దశ

**40 లక్షల సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర,మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి.**

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని గల బీసీ కాలనీ వాసుల చిరకాల కోరిక నెరవేరింది.



ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, తుగ్గలి మాజీ జెడ్పిటిసి సభ్యురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం రోజున ఘనంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు కృషితోనే ఈ సీసీ రోడ్డు మంజూరైందని,కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన కాలనీలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని,రాబోయే రోజుల్లో తుగ్గలి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వారు హామీ ఇచ్చారు. బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీసీ కాలనీవాసులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ నివాసులు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోషక ఆహారమే ఆరోగ్యానికి పునాది



బేతంచెర్ల : పోషక ఆహారంతోనేచిన్నారులు,బాలింతలు,గర్భిణీలు,కిషోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని సూపర్వైజర్ అరుణ,పీహెచ్‌సీ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి,తెలిపారు.మంగళవారం మండలంలోని అంబాపురం గ్రామంలో అంగన్వాడీ ఉత్సవాలునిర్వహించారు.వారు మాట్లాడుతూ 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ వరకు అంగన్వాడీ ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.మాతృ సంరక్షణ,పోషణ,శిశు అభివృద్ధి,టీకాలు,మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.సమాజ సేవలోఅంగన్వాడీ సెంటర్లు ఎంతో కీలకమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి,అంగన్వాడీ టీచర్లు చందన,రమాదేవి,ఆశా వర్కర్లు పుల్లమ్మ,మహేశ్వరి,పాల్గొన్నారు.

## జంప్ రోప్ పోటీల్లో ప్రతాపం చూపిన 11 మంది రెయిన్‌బో విద్యార్థులు

**జాతీయ పోటీలకు అర్హత.**

**నాందేడ్ నేషనల్స్‌కు 'రెయిన్‌బో' క్రీడాకారులు**

**మెడల్సే లక్ష్యం!**

**కరెస్పాండెంట్ పి.ఎ. ఖాన్.**

రేణిగుంట అన్నమయ్య జంప్ రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ సబ్-జూనియర్ ఇంటర్-డిస్ట్రిక్ట్ జంప్ రోప్ ఛాంపియన్‌షిప్ ? ఆంధ్రప్రదేశ్ పోటీల్లో రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-12, అండర్-14 విభాగాల్లో విశేష ప్రతిభ చాటిన 11 మంది విద్యార్థులు నేషనల్స్ కు అర్హత సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.?జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలు ?బాలికల విభాగం దీప్తి హనీ కె. (8వ తరగతి), కీర్తి కె. (8వ తరగతి), కారుణ్య ఎస్. (7వ తరగతి), దీపాన్విత కె. (8వ తరగతి), ప్రణవి కె. (8వ తరగతి), జ్ఞాపిక ఎన్. (7వ తరగతి).?బాలుర విభాగం..కె.ఎం.డి. రిహాన్ (9వ తరగతి), దీక్షిత్ కుమార్ (8వ తరగతి), ఎస్. ముస్తఫా (7వ తరగతి), ఎండి. ఖదీర్ (8వ తరగతి), బి. ఎస్లినక్షత్ర (8వ తరగతి).?ఈ జాతీయ స్థాయి పోటీలు మహారాష్ట్రలోని నాందేడ్ లో అక్టోబర్ 29 నుండి నవంబర్ ఒకటో 1 వరకు జరగనున్నాయి.?ఈ సందర్భంగా రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరెస్పాండెంట్ శ్రీ పి.ఎ. ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులను అంకితభావంతో తీర్చిదిద్దిన కోచ్ రెడ్డి కుమార్ కి, విద్యార్థుల క్రీడా ప్రతిభను నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లోనూ తమ విద్యార్థులు పాల్గొని మెడల్స్ సాధిస్తారని, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నామమును సగర్వంగా నిలబెడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# బుల్లెట్ రైలు పై అపోహలు వద్దు ప్రజల ఆకాంక్షే ప్రాధాన్యం

**సూర్యాపేటకు బుల్లెట్ రైలు కచ్చితంగా వస్తుంది!...అది మన మీదనే ఆధారపడి ఉంది**

**మనం ప్రజా ప్రతినిధులను...నిలదీయకుండా మౌనంగా ఉంటే... మరో 80 ఏళ్లు రైలు గురించి మాట్లాడకుండా ఉండాల్సి వస్తుంది**

**ముక్తకంఠంతో సూర్యాపేట ప్రజలందరూ గొంతు ఎత్తుదాం...**

**రండి ఉద్యమంలో పాలి భాగస్తులు కండి**

**ప్రత్యేక కథనం**

**సీనియర్ పాత్రికేయులు కందుకూరి యాదగిరి --**

**9640282050**

బుల్లెట్ రైలు... ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో హాట్ టాపిక్ గా మారింది.సూర్యాపేట జిల్లా కేంద్రం నుండి బుల్లెట్ ట్రైన్ మొదటి అలైన్మెంట్ తిరిగి కొనసాగుతుందా...? ఈ చర్చ రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే కాదు దేశవ్యాప్తంగానే కొనసాగుతున్నట్లు సమాచారం.సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు వస్తుందా? రాదా? స్టేషన్ ఉంటుందా? ఉండదా? ఇలా అనేక సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.సోషల్ మీడియాలో, ప్రజా చర్చల్లో భిన్నమైన సమాచారం ప్రచారంలోకి వస్తుండటంతో మరింత గందరగోళం నెలకొంటోంది.ఈ నేపథ్యంలో దేశ ప్రజలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ముఖ్యంగా సూర్యాపేట జిల్లా కేంద్రం వారు ఒక విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.బుల్లెట్ రైలు వంటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో అలైన్‌మెంట్, స్టేషన్లు, స్టాప్‌లు అన్నీ సర్వేలు, సాంకేతిక అధ్యయనాలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రజా అవసరాలు వంటి అనేక అంశాల ఆధారంగా ఖరారవుతాయి.

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ముంబై--అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ మార్గం -

దేశంలో తొలి హైస్పీడ్ రైలు ప్రాజెక్టుగా నిర్మాణంలో ఉన్న ముంబై--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ మొత్తం 508 కిలోమీటర్లు. ఇందులో 12 స్టేషన్లు ఉన్నాయి.ముంబై, థానే, విరార్, బోయిసర్, వాపి, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి స్టేషన్లు ఉన్నాయి.ఈ మార్గంలో పరిమిత స్టాప్‌లతో ముంబై--అహ్మదాబాద్ ప్రయాణ సమయం సుమారు 2 గంటల 7 నిమిషాలు, అన్ని స్టాప్‌లతో సుమారు 2 గంటల 58 నిమిషాలుగా చీనూ=జూ (నేషనల్ హై స్పీడ్ రైలు కార్పొరేషన్ లిమిటెడ్) పేర్కొంది. రైలు గరిష్ఠ ఆపరేటింగ్ వేగం గంటకు 320 కిలోమీటర్లు. గంటకు ఇంతటి వేగం ఉన్నప్పటికీ ప్రతి స్టేషన్ వద్ద రెండు లేదా మూడు నిమిషాలు ఆగుతూ ఆగిన సమయాన్ని కవర్ చేసే విధంగా బుల్లెట్ రైలు స్పీడ్ ఉంటుందని నిపుణులు చర్చించుకుంటున్నారు.

బుల్లెట్ రైలు అంటే ....నాన్ స్టాప్ గా వెళ్లే రైలు మాత్రమే కాదు బుల్లెట్ రైలు అనగానే ఎక్కడ ఆగకుండా మొదటి స్టేషన్ నుండి చివరి స్టేషన్ వరకు హై స్పీడ్ తో వెళ్లే రైలు అని అందరూ అనుకుంటున్నారు.అది సరైనది కాదు... పైన ఇచ్చిన ఉదాహరణ ప్రకారంగా ముంబై టు సబర్మతి స్టేషన్ల వరకు 12 స్టేషన్లో స్టాప్లు ఉన్నాయి.ఇక్కడే మనం అర్థం చేసుకోవచ్చు..బుల్లెట్ రైలు అంటే కేవలం ఒక నగరం నుంచి మరో నగరానికి నాన్‌స్టాప్‌గా వెళ్లే రైలు మాత్రమే కాదని. స్పష్టమవుతుంది.

బుల్లెట్ రైలు వెళ్లే మార్గంలో ప్రధాన పట్టణాలు, ఆర్థిక కేంద్రాలు, ప్రజల రవాణా అవసరాలు, ప్రాంతీయ అభివృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని స్టేషన్లను ఏర్పాటు చేసే విధానం ఇందులో కనిపిస్తోంది. ఆయా ప్రజల ఆకాంక్షను బట్టి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. ఇంతే కాకుండా ముంబై టు శబరిమతి బుల్లెట్ రైలు నిర్మాణం ముందుగా ఆరు స్టేషన్లో అనుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత ప్రజల ఆకాంక్ష మేరకు అక్కడి ప్రభుత్వ ప్రతిపాదన ప్రజా ఆకాంక్షల మేరకు ఆరు స్టేషన్లుగా ఉన్న దానిని 12 స్టేషన్లుగా మార్చారు.ఈ విషయం ముంబై టు సబర్మతి వైపుగా నిర్మాణం అవుతున్న బుల్లెట్ ట్రైన్ మార్గం మనకు ఒక మంచి ఉదాహరణ అని అందరూ గమనించాలి.

అదే ఆశ సూర్యాపేటకు ఎందుకు ఉండకూడదు?

హైదరాబాద్ చెన్నై హై స్పీడ్ రైలు ప్రతిపాదనలో తొలినాలలో శంషాబాద్ బాటసింగారం నార్కట్పల్లి సూర్యాపేట విజయవాడ వైపు వెళ్లే అలైన్మెంట్ ప్రతిపాదించబడింది. ఈ మార్గంలో సూర్యాపేటకు ప్రాధాన్యం లభించే అవకాశం అప్పట్లో కనిపించింది. ముంబై టు సబర్మతి రూట్ లో బుల్లెట్ రైలు కొనసాగుతున్న విధంగానే ఎన్నో సంవత్సరాలుగా రైలు కోసం ఎదురుచూస్తున్న సూర్యాపేట ప్రజల ఆకాంక్ష నెరవేర్చుకునే సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం విడుదల చేసిన మొదటి అలైన్మెంట్ కాస్త సూర్యాపేట ప్రజలకు జీవం పోసినట్లుగా అనిపించింది. ఇంతలోనే చేదు వార్త ఒకటి చెవిలో పడ్డట్టు అయింది. అంతమాత్రానికి నిరుత్సాహ పడాల్సిన పనిలేదు.ఇది వేరే రూట్ లో మార్చబడుతుంది అన్న వార్త పోరాట పటిమగలిగిన సూర్యాపేట ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. వెంటనే ఉద్యమ బాట పట్టారు. వేరే రూట్ కు మార్చిన ప్రభుత్వ యంత్రాంగం తమ ఆలోచనను కొనసాగించకుండా డీపీఆర్ ఇంకా విడుదల చేయకుండా అలా నిలిపివేసినట్లు తెలిసింది. కాగా సూర్యాపేట ప్రజలు తమకు కేటాయించిన రైలు తమ ప్రాంతంలో నుండే కొనసాగాలని గత మూడు నెలలుగా వివిధ రకాలుగా ఉద్యమాలు చేస్తున్నారు. తమకు రావలసిన బుల్లెట్ ట్రైన్ అవతలివాడు ఎత్తుకుపోయాడు దాన్ని మింగక ముందే తమ ట్రైన్ తాము తెచ్చుకోవాలని చేస్తున్న ఉధృత ఉద్యమ సమాచారం అందుకున్న ప్రభుత్వాలు ఆలోచనలో పడి

రూటు మార్చాలనుకుంటున్న ప్రాంతాన్ని కూడా నిలిపివేసినట్లు విశ్వసనీయ సమాచారం అందుతుంది.

ఎక్కువ అవకాశాలు సూర్యాపేటకి ఉన్నాయి

బుల్లెట్ ట్రైన్ శంషాబాద్ టు సూర్యాపేట జాతీయ రహదారి 65 సమాంతరంగా విజయవాడ మీదుగా మద్రాస్ కొనసాగించడానికి ఎక్కువ అవకాశాలు సూర్యాపేట కె ఉన్నట్లు నిపుణులు అంటున్నారు.ఎలాగూ జాతీయ రహదారి మనకు ఉండనే ఉన్నది దాని సమాంతరంగా కొనసాగించడానికి బుల్లెట్ ట్రైన్ మార్గం వేయడానికి నిర్మాణకులకు గాని కాంట్రాక్టర్లకు గాని ఇంజనీర్లకు అధికారులకు ప్రభుత్వాలకు తక్కువ ఖర్చు తక్కువ సమయం పట్టే విధంగా రూట్ లైన్ క్లియర్ గా ఉన్నది. స్టేషన్ల నిర్మాణం చేయడానికి కావలసినంత స్థలాలు కూడా అనుగుణంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.పెద్ద పెద్ద కొండలు గుట్టలు చెరువులు వాగులు వంకలు లాంటివి ఏవి లేకుండా ఉండడంతో బుల్లెట్ ట్రైన్ మార్గం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

సూర్యాపేట ప్రజలు నిరాశ చెందాల్సిన అవసరం కూడా లేదు ఎందుకంటే ఆ లైన్ మెంట్ పై చర్చే సర్వేలు స్టేషన్లో ఎంపిక వంటి ప్రక్రియలో ప్రజల అవసరాలు ప్రాంతీయ ప్రాధాన్యత భవిష్యత్తు అభివృద్ధి అవకాశాలు కీలకమైన అంశాలుగా ఉంటాయి.సూర్యాపేటకు ఎందుకు ప్రాధాన్యం?

భారతదేశ నాయకులారా ప్రజాప్రతినిధులారా రైల్వే అధికారులారా బుల్లెట్ రైలు సూర్యాపేటకు ఎందుకు రావాలి? అని మీరు అడిగితే మా దగ్గర అన్ని రకాల సమాధానాలు ఉన్నాయి. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి మార్గంలో ఉన్న సూర్యాపేట భౌగోళికంగా కీలక ప్రాంతం.సూర్యాపేట కోదాడ నకిరేకల్ చిట్యాల ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్లోని ప్రధాన పట్టణాలను అనుసంధానించే రవాణా వ్యవస్థకు ఈ ప్రాంతం ఇప్పటికే ఒక ప్రాముఖ్యమైన కేంద్రంగా కొన్ని వందల సంవత్సరాలుగా కొనసాగుతుంది. కోట్లల్లో వ్యాపారాలు చేసే శ్రీమంతులు సైతం ఇదే ప్రాంతాలకు సంబంధించిన పట్టణాలలో వేల సంఖ్యలో ఉన్నారు. అత్యధిక జనాభా కలిగిన ప్రాంతంగా జన సందోహం తిరిగే ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలకు ప్రతిరోజు జాతీయ రహదారి 65 గుండా లక్షలాది మంది రోజుకు బస్సుల ద్వారా కార్లు పలు రకాల వాహనాల ఆధారంగా ప్రయాణిస్తున్నారు.

సూర్యాపేట ప్రజల ఆకాంక్ష అందువల్ల సూర్యపేట ప్రజల ఆకాంక్ష ఒక్కటే బుల్లెట్ రైలుకు సూర్యాపేటకు తగిన ప్రాధాన్యం కల్పించాలి.అవసరమైతే సూర్యాపేటలో స్టేషన్ ఏర్పాటు చేయాలి.ఇది కేవలం ఒక పట్టణం కోరిక కాదు ఒక రాజకీయ నాయకుల కోరిక కాదు వ్యాపారస్తుల కోరిక కాదు పోరాట గడ్డలో పుట్టిన ప్రతి పౌరుడి గుండెల్లో నుంచి పుట్టుకొచ్చిన తమ భవిష్యత్తు పైన ఒక చిరకాల వాంఛ గా ప్రభుత్వాలు చూడాలి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యత ప్రభుత్వాలపైన ప్రభుత్వ అధికారుల పైన ఎంతైనా ఉన్నది అన్న సంగతి ప్రభుత్వాలు తెలుసుకోవాలి. భవిష్యత్తులో సూర్యాపేటలో విద్యా వైద్యం వ్యాపారం పరిశ్రమలు ఉపాధి రవాణా రంగాల్లో మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం గా ప్రజలు బుల్లెట్ ట్రైన్ కోసం ఎదురుచూస్తున్నారు ఎంతటి త్యాగానికైనా సిద్ధపడి సాధించుకోవడానికి ఉద్యమిస్తున్నారు. ఈ రూట్ లో బుల్లెట్ ట్రైన్ వస్తే...20 స్టేషన్లు ఉంటాయా?

హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 65 సమాంతరంగా చెన్నై హై స్పీడ్ రైలు మార్గానికి సంబంధించి వివిధ దశల్లో వేరువేరు మార్గాలు స్టేషన్ ప్రతిపాదనలు చర్చలోకి వచ్చినట్లు సమాచారం.ఇటీవల ప్రచారంలోకి వచ్చిన ఒక ప్రతిపాదిత జాబితాలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ తమిళనాడు ప్రాంతాలు కలిపి 18 స్టేషన్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి.అయితే స్టేషన్ల సంఖ్య పేర్లు తుది-డిపిఆర్- అధికారిక ఆమోదాలు తుది అలైన్మెంట్ పై ఆధారపడి ఉంటాయి.20 స్టేషన్లు కచ్చితంగా వస్తాయని చెప్పడం కష్టమే అయినప్పటికీ భవిష్యత్తులో ప్రజల అవసరాలకు అనుగుణంగా స్టేషన్లను పెంచే అవకాశం మార్పులు జరిగే వీలు ఉంటుంది

అపోహలకు కాదు ఉద్యమానికి సమయం

ఎవరో కల్పిస్తున్నటువంటి అపోహలను పక్కనపెట్టి ఉద్యమం చేసి సాధించుకునే మార్గంలో ఆలోచన చేయాలి. బయటివాడు



కాదు మనోడే మన ప్రాంతపుడే మనతోపాటు వృత్తి చేసేవాడే రోజు మనతో మాట్లాడే వాడే మనతో నవ్వుతూ మాట్లాడతాడు అవతలకు వెళ్లి గోతులు తొవ్వుతాడు మనకు బద్ధ శత్రువులా తయారవుతాడు. మనల్ని నానా రకాలుగా వెనుకకు లాగుతూ ఉంటాడు నిరుత్సాహ పరుస్తాడు. ఉద్యమం చేయలేక చేతకాక చేవ చచ్చిన వాడిలా ఉంటూ చేసేవారిని తక్కువ అంచనా చేసి అపహస్యం చేసి మాట్లాడుతుంటాడు. ఉద్యమం చేసి ఎక్కడ తమ కంటే ఎక్కువ పేరు సంపాదించుకుంటాడో నన్న ఆలోచనతో కుళ్ళ కుతంత్రాలతో తాను నిద్రపోకుండా మనకు నిద్ర పట్టకుండా చేస్తాడు. బద్నాం చేస్తారు.నిందలు వేస్తారు. ఇలాంటివన్నీ ఉద్యమకారుల చెవిలో పడ్డప్పుడు అసలు లెక్కచేయొద్దు.ముందుకు కొనసాగాలి ట్రైన్ సాధించేవరకు విశ్రమించేది లేదు.తెలంగాణ రాష్ట్రాన్ని సైతం ఎన్నో ఉద్యమాలను చేసి సాధించుకున్నాం. అదేవిధంగా ప్రస్తుతం బుల్లెట్ ట్రైన్ సాధించుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు జరుగుతున్న ఉద్యమాలకు మద్దతు తెలుపుతూ ముందుకు రావాలి

ముంబై టు అహ్మదాబాద్ 508 కిలోమీటర్లు బుల్లెట్ రైలు గంటకు 300 కిలోమీటర్ల పైగా వేగా వెళుతుంది.అలాంటిది సూర్యాపేటలో ఎలా ఆగుతుంది అని అనుకోకూడదు.ఆ ప్రాంతంలో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.అక్కడ 12 స్టేషన్ల ఏర్పాటు జరుగుతుంది. అలాంటప్పుడు శంషాబాద్ టు విజయవాడ చెన్నై బుల్లెట్ రైలు వెళ్లడానికి ఇక్కడి ప్రాంతానికి సంబంధించిన ప్రజలు స్టేషన్ల కోసం పోరాడడంలో తప్పులేదు

## కొలిక్కి వచ్చిన వివేకా కేసు

హైదరాబాద్, సెప్టెంబర్29, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో రోజుకో కొత్త మలుపు చోటుచేసుకుంటోంది. ఈ కేసులో ఏ2గా ఉన్న కీలక నిందితుడు సునీల్ యాదవ్ సంచలన కామెంట్లతో విచారణాధికారులతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు, వెనుక ఉన్న కుట్ర కోణాలను తాను ఈడీ అధికారులతో పాటు బయటి ప్రపంచానికి కూడా వెల్లడిస్తున్నారు. ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణాలు, లాభపడిన వ్యక్తుల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ కేసు తీవ్రతను మరో స్థాయికి తీసుకెళ్లాయి.వివేకా హత్య ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడింది మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన భార్య వైఎస్ భారతి, అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాత్రమేనని సునీల్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. అసలు సూత్రధారులను పక్కనపెట్టి తమ వంటి వారిని వేధించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, విచారణ పారదర్శకంగా జరగాలంటే జగన్ , భారతిలను కూడా సీబీఐ, ఈడీ అధికారులు తక్షణమే విచారించాలని ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు. ఇప్పటికే అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం కంటే, కుట్రలో చురుగ్గా పాల్గొన్న సునీల్ యాదవ్ ఇలా తెగించి మాట్లాడటం కేసు గమనాన్ని మార్చేలా ఉంది.సునీల్ యాదవ్ చేసిన ఈ ఆరోపణలు దర్యాప్తు సంస్థల పనితీరుపై కూడా పలు అనుమానాలను, ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. హత్య జరిగిన సమయం నుంచి నేటి వరకు లభ్యమైన ఆధారాలు, సాక్ష్యాలు ఒక వైపు వేళ్లు చూపిస్తున్నప్పటికీ.. దర్యాప్తు సంస్థలకు ఈ ప్రాథమిక అనుమానాలు ఎందుకు రావడం లేదనే చర్చ నడుస్తోంది. కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక వ్యక్తుల సమీపానికి కూడా సీబీఐ అధికారులు వెళ్లేందుకు ఎందుకు సంకోచిస్తున్నారనే ప్రశ్నలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.దస్తగిరి, సునీల్ యాదవ్ కేవలం హత్యలో భాగం అయిన వారు. డబ్బుల కోసం ఆ పని చేసిన వారు. కానీ అసలు సూత్రధారులు , హత్యకు కారణమైన పెద్ద తలకాయలను విచారించకుండా, కేవలం క్షేత్రస్థాయిలో ఉన్న వారిపైనే దృష్టి సారిస్తే ఈ కేసు చిక్కుముడి ఎలా వీడుతుందనేది యక్షప్రశ్నగా మారింది. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ హైప్రొఫైల్ హత్య కేసులో దస్తగిరి తరహాలోనే మరొక కీలక నిందితుడు బయటపడి నేరుగా మాజీ సీఎం కుటుంబాన్నే నిలదీయడం రాజకీయంగా పెద్ద దుమారమే రేపుతోంది. సునీల్ యాదవ్ లేవనెత్తిన ఈ డిమాండ్లపై సీబీఐ, ఈడీ అధికారులు ఏ రకంగా స్పందిస్తారో, విచారణ ప్రక్రియను ఏ మలుపు తిప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

### నరసరావుపేటలో యువకుడు దారుణ హత్య

పల్నాడు నరసరావుపేట కాసు బ్రహ్మానందరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ లో అర్ధరాత్రి యువకుడు హత్య కు గురయ్యాడు. రాయితో తలపై కొట్టి గుర్తుతెలియని దుండగులు హత్య చేసారు. మృతుడు నరసరావుపేట పెదచెరువుకు చెందిన తాపిమేస్త్రీ రాజేష్ 36 గా గుర్తించారు. గత రాత్రి షాపింగ్ కాంప్లెక్స్ లో రాజేష్ మద్యం సేవించి నిద్రపోయాడు. మృతుని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బాలయ్య.. ప్రభాస్ స్టార్ వార్ తో అమెరికాను కాలకేయులతో పోల్చి 'బాహుబలి'తో ఇరాన్ వార్నింగ్

హైదరాబాద్, సెప్టెంబర్29, పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతోన్న యుద్ధం ఏడు నెలలు పూర్తి చేసుకుంది. ఇరు దేశాలూ పరస్పరం బాంబులు, యుద్ధ విమానాలు, క్షిపణులతో దాడులు చేసుకుంటున్నాయి. ఇదే సమయంలో సోషల్ మీడియాలోనూ మీమ్స్‌తో హోరెత్తిస్తున్నాయి. ఈ విషయంలో ఇరాన్ ఒక అడుగు ముందుకేసింది. భారతీయ సినిమాలతో ముఖ్యంగా టాలీవుడ్ చిత్రాల్లో యాక్షన్ సీన్లతో అమెరికాకు వార్నింగ్‌లు ఇస్తోంది. తాజాగా, దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఎపిక్ బాహుబలి వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది.అమెరికాతో మీమ్స్ యుద్ధంలో టాలీవుడ్ సినిమా క్లిప్పింగులను ఇరాన్ తెగ వాడేస్తోంది. ఇటీవల నందమూరి బాలకృష్ణ సినిమా 'భగవంత్ కేసరి'లోని యాక్షన్ సీన్ క్లిప్పింగ్‌తో అగ్రరాజ్యానికి జింబాబ్వేలోని ఇరాన్ రాయబార కార్యాలయం వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా, ప్రభాస్ నటించిన బాహుబలి సినిమాలోని వీడియో క్లిప్‌తో అమెరికాకు కౌంటర్ ఇవ్వడం విశేషం. హైదరాబాద్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం.. కాలకేయులతో బాహుబలి యుద్ధం చేస్తున్న దృశ్యాలను పోస్ట్ చేసింది. తాము ఎవ్వరికీ తలవంచబోమని, కాలకేయులతో బాహుబలి పోరాడినట్టు తాము కూడా మాతృదేశం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేసింది.'మేం ఎవ్వరికీ తలవంచబోమని మా అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఐకరాజ్యసమితి సాధారణ సభ సమావేశంలో కుండబద్దలు కొట్టారు.. కాలకేయులకు ఎదురొడ్డి బాహుబలి యుద్ధం చేసినట్టే.. మేం కూడా మా మాతృదేశం కోసం రక్తాన్ని చిందించి ప్రాణత్యాగానికైనా సిద్ధపడతాం" అని ఎంబసీ పేర్కొంది. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఓ షియా ముస్లిం దేశం హిందూ దేవతను పూజించడంపై పోస్ట్ పెట్టడం నిజంగా గ్రేట్' అని పోస్ట్‌పై ఓ నెటిజన్ కామెంట్ చేశాడు."తెలుగు మీమ్స్‌తో షియా దేశం... నేను షియాని, మా పూర్వీకులు బలూచిస్థాన్‌కు చెందినవారు, ఇప్పుడు మేము తెలుగు గడ్డపై నివసిస్తున్నాం... జై భారత్ జై పర్షియా" అని ఒకరు.. 'ఇతర దేశాలతో పోలిస్తే ఇరాన్ సోషల్ మీడియా రంగం చాలా మెరుగ్గా ఉంది' అని మరొకరు వ్యాఖ్యానించారు. ఇరాన్ ఎంబసీ పెట్టిన పోస్ట్ ఇప్పటి వరకూ 2 లక్షలకుపైగా వ్యూస్ రాగా.. 4 వేలకుపైగా లైక్‌లు వచ్చాయి.ఇదిలా ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీతో ఇరాన్‌పై దాడులు చేయడంతో యుద్ధం మొదలైంది. తమ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ సహా కీలక నేతల మరణాలకు ప్రతీకారంగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా మిత్రదేశాలు, దాని సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయడంతో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జల సంధిని ఇరాన్ మూసివేసింది. ఇది అంతర్జాతీయంగా తీవ్ర ప్రభావం చూపింది.

# అమరావతి ఔటర్ రింగ్ రోడ్ కు లైన్ క్లియర్

విజయవాడ, సెప్టెంబర్ 29, ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 189.93 కిలోమీటర్ల పొడవునా 6 లేన్లతో నిర్మించనున్న ఈ ఔటర్ రింగ్ రోడ్డు పనులను 4 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి ఎన్‌హెచ్‌ఏఐ కి ప్రతిపాదనలు పంపించారు. ఈ రహదారితో పాటు నారాకోడూరు నుంచి గుంటూరు శివార్లలోని బుడంపాడు వరకు 5.2 కిలోమీటర్ల పొడవునా 4 వరుసల స్పర్ రోడ్డును కూడా అనుసంధానం చేయనున్నారు. దీంతో ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు 195.13 కిలోమీటర్లకు చేరుకుంది. అమరావతి ఓఆర్ఆర్‌లో కృష్ణా నదిపై 2 వంతెనలు, 3 సొరంగాలు సహా అన్ని పనులు కలిపి 4 ప్యాకేజీలుగా విభజించారు. గతంలో ప్రతి 25 నుంచి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 6 నుంచి 8 ప్యాకేజీలుగా నిర్మించాలని మొదట భావించినప్పటికీ, పనుల పర్యవేక్షణ సులభతరం చేసేందుకు ప్యాకేజీల సంఖ్యను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు.మొదటి ప్యాకేజీ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి ప్రారంభమై కొండపల్లి, పంగిడి అటవీ ప్రాంతాల మీదుగా మైలవరం వరకు (27వ కిలోమీటర్) సాగుతుంది. ఇందులో 2 సొరంగాలు ఉంటాయి. అలాగే చివర్లో ఉండే 189వ కిలోమీటర్ నుంచి 189.93 కిలోమీటర్ వరకు ఉన్న పనులను ఈ మొదటి ప్యాకేజీలోనే చేర్చారు. రెండో ప్యాకేజీ మైలవరం 27వ కిలోమీటర్ నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను సమీపంలోని 83వ కిలోమీటర్ వరకు మొత్తం 56 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది.మూడో ప్యాకేజీ కోలవెన్ను 83వ కిలోమీటర్ నుంచి ప్రారంభమై గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని 133.5వ కిలోమీటర్ వరకు 50.5 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ ప్యాకేజీలో అదనంగా నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు ఉండే 5.2 కిలోమీటర్ల కనెక్టింగ్ రోడ్డుతో పాటు, వల్లూరుపాలెం వద్ద కృష్ణానదిపై 4.8 కిలోమీటర్ల పొడవైన వంతెన నిర్మించనున్నారు. నాలుగో ప్యాకేజీ పుల్లడిగుంట (133.5 కి.మీ) దగ్గర మొదలై ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల సమీపంలోని 189వ కిలోమీటర్ వరకు 55.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ ప్యాకేజీలో పేరేచర్ల వద్ద 400 మీటర్ల సొరంగం, మున్నలూరు వద్ద కృష్ణానదిపై 3.15 కిలోమీటర్ల మేర వంతెన ఉంటాయి.ఈ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయం రూ.30,491 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 4 ప్యాకేజీలకు కలిపి సివిల్ పనుల నిమిత్తం రూ.10,595.70 కోట్లు అవసరమని అంచనా వేశారు. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.5,315 కోట్లు నిధులు కేటాయించారు. మిగిలిన నిధులను పర్యావరణ, అటవీ అనుమతుల ఖర్చులు, విద్యుత్ లైన్ల తరలింపు, మరియు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద 15 ఏళ్లపాటు వడ్డీతో కూడిన చెల్లింపుల నిమిత్తం వినియోగించనున్నారు.

# జనసేనకు కల్ట్ పొలిటికల్ ఇమేజ్

కాకినాడ, సెప్టెంబర్ 29, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సాధించిన కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీలోకి ప్రస్తుతం ఇతర పార్టీల, ముఖ్యంగా ప్రతిపక్ష వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి, నియోజకవర్గ స్థాయి నేతల నుంచి భారీగా చేరికలు సాగుతున్నాయి. ఓటమి భారం, భవిష్యత్తుపై అస్పష్టతతో తీవ్ర అంతర్మథనంలో ఉన్న వైసీపీ నేతలు జనసేన వైపు చూపుతుండటంతో, రాష్ట్రంలో వైసీపీకి పూర్తిస్థాయి ప్రత్యామ్నాయాన్ని జనసేన ఆక్రమించే అవకాశం ఉందా అనే అంశంపై చర్చలు ప్రారంభమయ్యాయి.ఉత్తరాంధ్ర నుంచి నెల్లూరు వరకు కూటమి కారణంగా వైసీపీ రాజకీయ పునాదులు గణనీయంగా బలహీనపడ్డాయనేది కొట్టిపారేయలేని నిజం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకోవడం సులభం కాదన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు, నాయకులు కొత్త రాజకీయం కోసం వెతుకులాడుతున్నారు. ఈ క్రమంలో అధికారంలో ఉండటంతో పాటు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ, సాధిస్తున్న ఇమేజ్ చాలామందికి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. కేవలం నియోజకవర్గ నేతల చేరికలే కాకుండా, పూర్తిస్థాయిలో లీడర్లను, క్యాడర్‌ను నిలకడగా పార్టీలోకి తెచ్చుకోగలిగితేనే ఈ వలసలు రాజకీయ బలంగా మారేందుకు ఆస్కారం ఉంటుంది.గతంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును, స్థానిక నేతలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ రకంగానైతే క్రమంగా తన వైపు తిప్పుకొని సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారో, ఇప్పుడు పవన్ కళ్యాణ్ కూడా వైసీపీ వద్ద ఉన్న అసంతృప్తికరమైన ఓటు బ్యాంకును, ఆ పార్టీ క్యాడర్‌ను తనవైపు మళ్లించుకోవాల్సిన వ్యూహాత్మక అవసరం ఉంది. ఓటు బ్యాంకు అనేది కేవలం చేరికలతోనే మారదు. దానికి క్షేత్రస్థాయిలో నమ్మకాన్ని కల్పించే సంస్థాగత నిర్మాణం అవసరం. వైసీపీ శ్రేణులు జనసేన సిద్ధాంతాలను, పవన్ నాయకత్వాన్ని స్వీకరించి, వారంతా శాశ్వత ఓటర్లుగా మారేలా సరైన రోడ్‌మ్యాప్ రూపొందించుకుంటేనే ప్రత్యామ్నాయ రాజకీయం రూపుదిద్దుకుంటుంది.జనసేన ప్రత్యామ్నాయంగా ఎదగడానికి ప్రధాన అడ్డంకి, సంక్లిష్టత ప్రస్తుతం ఉన్న కూటమి రాజకీయాలే. టీడీపీతో కలిసి ప్రభుత్వం నిర్వహిస్తున్న వేళ, వైసీపీకి వ్యతిరేకంగా పోరాటంలో తన స్వతంత్రతను కాపాడుకుంటూనే, పొత్తుకు విఘాతం కలగకుండా నాయకులను చేర్చుకోవడం ఒక కత్తిమీద సాము. ముఖ్యంగా కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో టీడీపీతో ఎలాంటి ఘర్షణాత్మక వాతావరణం రాకుండా, వైసీపీ ఓటు బ్యాంకునూ, లీడర్లనూ తన గూటికి చేర్చుకోవడంలో జనసేన అనుసరించే రాజకీయంపైనే పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.పవన్ కళ్యాణ్‌కు ఉన్న అపారమైన వ్యక్తిగత క్రేజ్, కల్ట్ ఇమేజ్ స్థిరమైన రాజకీయ శక్తిగా మారాలంటే నిలకడైన ప్రజాదరణతో పాటు పక్కా సంస్థాగత బలం తోడవాలి. వైసీపీ ఓటు బ్యాంకును, స్థానిక నాయకత్వాన్ని పకడ్బందీగా స్వీకరించి, రాయలసీమతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బలమైన పార్టీ క్యాడర్‌ను నిర్మించిన రోజున ? పవన్ తన అసలైన కల్ట్ రాజకీయ పవర్‌ను చూపించే అవకాశం లభిస్తుంది. ఒకవేళ ఈ ఫ్లో ఇలాగే కొనసాగి, వైసీపీలోని ఖాళీని జనసేన భర్తీ చేయగలిగితే, రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాలు టీడీపీ-వైసీపీ పోరు నుంచి టీడీపీ వర్సెస్ జనసేన వైపు మారినా ఆశ్చర్యపోనవసరం లేదు.

# కాపులకు వైసీపీ గాలం

విజయవాడ, సెప్టెంబర్ 29, ఏపీ రాజకీయాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తన ఉనికిని చాటుకోవడానికి, కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి అనేక మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగానే రాబోయే రోజుల్లో కూటమిలోని కీలక భాగస్వామి అయిన జనసేనను, దాని మూలస్తంభమైన సామాజికవర్గాన్ని టార్గెట్ చేయడం ఒక వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారింది.తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో చోటుచేసుకున్న వంగవీటి రంగా విగ్రహ వివాదం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. నియోజకవర్గ పరిధిలోని స్థానిక సెంటిమెంట్లను రగిల్చి, దాని ద్వారా కూటమిలోని పార్టీల మధ్య ? ప్రత్యేకించి టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య ? అపోహలు సృష్టించేందుకు వైసీపీ సిద్ధం చేసిన ఒక రాజకీయ ప్రణాళిక అని జరిగిన దాన్ని బట్టి చూస్తే అర్థమైపోతుంది.ఏదైనా ప్రాంతంలో విగ్రహాల ఏర్పాటుకు స్థానిక పరిపాలనా అనుమతులు తప్పనిసరి. కానీ, స్థానిక అధికారులు మంత్రి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే లోపే, అనుమతుల కాలయాపనను నెపంగా చూపి రాత్రికి రాత్రే విగ్రహాన్ని పెట్టేయడం వెనుక స్పష్టమైన ఉద్దేశం కనిపిస్తోంది. విగ్రహం తొలగింపు పరిణామాలను తమ రాజకీయ లబ్ధికి వాడుకోవాలనేది ఇక్కడ వ్యూహం. ఈ క్రమంలోనే రాజకీయ అరంగేట్రం కోసం వేచి చూస్తున్న వంగవీటి ఆశాకిరణ్ వంటి నాయకులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని భావోద్వేగపూరితమైన వ్యాఖ్యలు చేయడం, రాజకీయాన్ని తీవ్రతరం చేయడం గమనార్హం. ప్రజా సమస్యలపై కాకుండా విగ్రహ రాజకీయాలపై ఆత్రుత చూపడం వెనుక ఉన్న స్వార్థం ప్రజలకు స్పష్టంగానే అర్థమవుతోంది.ఈ ఉదంతం వెనుక ఉన్న ప్రధాన కుట్ర కూటమిలోని జనసేన ఓటు బ్యాంకును వేరు చేయడం. టీడీపీ పాలన వల్ల రంగా విగ్రహానికి అన్యాయం జరిగిందనే ప్రచారాన్ని హోరెత్తించడం ద్వారా ఆ వర్గం యువతలో అసంతృప్తి రగల్చాలని వైసీపీ భావిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందనే నిజాన్ని మరిపించి, కేవలం కుల కోణాన్ని మాత్రమే ముందుకు నెట్టడం ద్వారా జనసేనకు లభించే సామాజిక మద్దతును బలహీనపరచడమే దీని అంతిమ లక్ష్యం. కాపు సెంటిమెంట్‌ను జనసేన నుండి వేరు చేస్తే తప్ప, ఆ పార్టీ రాజకీయ బలహీనత సాధించలేమనే అంచనాతోనే వైసీపీ ఈ రకమైన వ్యూహాలకు పదును పెడుతోంది.రాజకీయంగా ఇప్పుడిప్పుడే ప్రాధాన్యత పొందుతూ, సమ్మిళిత అధికారంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక వర్గానికి లేదా పార్టీకి ఇలాంటి వివాదాలు పెద్ద అగ్నిపరీక్ష వంటివి. అధికారంలో ఉన్నప్పుడు ఏ కొద్దిపాటి తొందరపాటు లేదా అతిగా స్పందించే ధోరణి కనిపించినా, అది ఇతర వర్గాల్లో ప్రతికూల భావన పెరిగేలా చేస్తుంది. తాము అధికారంలో ఉన్నామన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు సంయమనం కోల్పోతే, అది మిగిలిన సామాజికవర్గాలను దూరం చేసే ప్రమాదం ఉంది. ప్రత్యర్థులు పన్నిన ఈ కుల రాజకీయ వలలో చిక్కుకోకుండా ఉండాలంటే, భావోద్వేగాల కంటే పరిపక్వతతో కూడిన నిశ్శబ్ద వ్యూహం చాలా అవసరం.వైసీపీ విసిరిన ఈ విగ్రహ రాజకీయం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సింది కూటమి నాయకత్వమే.

చిన్న విషయాలను సైతం పెద్ద వివాదాలుగా మార్చేందుకు ప్రతిపక్షం సిద్ధంగా ఉందనే వాస్తవాన్ని గుర్తించాలి. అధికారంలో ఉన్న పక్షాలు ముందస్తుగా చట్టబద్ధమైన పరిష్కారాలు చూపాలి తప్ప, వివాదాలు పెరిగే వరకు వేచి చూడకూడదు. కాపు ఓటు బ్యాంకుతో పాటు ఇతర వర్గాల మద్దతును సమతుల్యంగా కాపాడుకోవాలంటే, జనసేన శ్రేణులు తీవ్ర సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, ప్రత్యర్థులు ఆశించినట్లుగానే సామాజిక సమీకరణాలు దెబ్బతిని, అంతిమంగా రాజకీయంగా ఎదిగుతున్న వర్గానికే కోలుకోలేని నష్టం జరుగుతుంది. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయన్న సంగతిని ఎవరూ మర్చిపోకూడదు.

# మంత్రివర్గంలో నో సీనియర్స్

విజయవాడ, సెప్టెంబర్ 29, మరికొద్ది రోజుల్లో ఏపీ మంత్రి వర్గ విస్తరణ ఉండనుందన్న ప్రచారం ఊపందుకుంది. రెండున్నరేళ్లు ముగిసిన తర్వాత కేబినెట్ మార్పులపై టీడీపీలో ఇప్పటి నుంచి చర్చ జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గాన్ని ఇలా ఎంపిక చేయడం వెనక కూడా దూరాలోచన ఉందని అంటున్నారు. రానున్న మంత్రి వర్గ విస్తరణలో కూడా సీనియర్లకు అవకాశం ఉండదన్న వాదన వినిపిస్తుంది. మరోసారి జూనియర్లకే అవకాశం ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు కారణాలు కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి వర్గ కూర్పులో సాంప్రదాయ రాజకీయ సమీకరణాలకు భిన్నంగా, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత వ్యూహాత్మక ఆలోచనలతో మంత్రులను ఎంపిక చేశారు. సీనియర్లను పక్కనపెట్టి మరీ ఎక్కువ మంది కొత్తవారికి చోటు కల్పించడం వెనుక ఆయనకున్న ప్రధాన ఆలోచనలు, వ్యూహాలు అనేకం ఉండొచ్చు. కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం ఇందుకు ఉదాహరణ. మంత్రివర్గంలో మొత్తం 24 మంది మంత్రులలో 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన పదిమందికి పైగా నేరుగా మంత్రి పదవులు దక్కాయి. రాబోయే కొన్ని దశాబ్దాల పాటు టు పార్టీని, రాష్ట్రాన్ని నడిపించగల సమర్థులైన ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఇప్పుడే తయారు చేయాలనేది చంద్రబాబు సుదీర్ఘ వ్యూహమని చెబుతున్నారు.. బీసీలకు పెద్దపీటమంత్రివర్గంలో వెనుకబడిన తరగతులకు 8 పదవులు, కాపులు మరియు కమ్మ సామాజిక వర్గాలకు చేరో 4 పదవులు, ఎస్సీలకు 3, ఎస్టీ మరియు మైనారిటీలకు ఒక్కో పదవి చొప్పున కేటాయించారు.ఆలోచన: టిడిపికి సాంప్రదాయకంగా అండగా ఉండే బీసీలకు ఈసారి కూడా పెద్దపీట వేయడం ద్వారా సామాజిక సమతూకాన్ని పాటించారు. అంతేకాకుండా మహిళలకు, గిరిజన ప్రాంతాలకూ ప్రాతినిధ్యం కల్పించారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బుచ్చయ్య చౌదరి, కన్నా లక్ష్మీనారాయణ వంటి హేమాహేమీ సీనియర్లను మంత్రివర్గంలోకి తీసుకోలేదు.ఆలోచన: సీనియర్లను కేవలం పరిపాలనకే పరిమితం చేయకుండా, వారి అనుభవాన్ని పార్టీ సంస్థాగత బలోపేతానికి మరియు శాసనసభ వ్యవహారాల నిర్వహణకు వాడుకోవాలనేది చంద్రబాబు ఆలోచన. పర్ఫార్మెన్స్ ఆధారిత పాలనమంత్రివర్గాన్ని ఎంపిక చేసిన తర్వాత కూడా చంద్రబాబు మంత్రుల పనితీరుపై నిరంతరం సమీక్షలు జరుపుతున్నారు. మంత్రులకు అంతర్గతంగా ర్యాంకులు ఇవ్వడం ద్వారా వారిలో పోటీతత్వాన్ని పెంచుతున్నారు. గత ప్రభుత్వం వల్ల దెబ్బతిన్న వ్యవస్థలను బాగు చేయాలన్నా, కేంద్ర నిధులను రాబట్టాలన్నా మంత్రులు నిరంతరం క్రియాశీలకంగా ఉండాలనేది ఆయన ఆలోచనఅని చెబుతున్నారు. కేవలం పదవుల అనుభవం కోసం కాకుండా డెలివరీ ఆధారంగానే మంత్రుల భవిష్యత్తు ఉంటుందని బాబు స్పష్టం చేశారు. మొత్తంగా చూస్తే, చంద్రబాబు నాయుడు ఈసారి కేవలం రాజకీయ లెక్కల కోసమే కాకుండా, వేగవంతమైన అభివృద్ధి, సమర్థవంతమైన పాలన , మరియు పార్టీ భవిష్యత్తు పునాది అనే త్రివిధ వ్యూహంతోనే ఈ మంత్రుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారని, రేపు మంత్రి వర్గ విస్తరణ జరిగినా ఇలాగే ఉంటుందని అంటున్నారు.

# డైరక్ట్ ఎన్నికలతో ఇబ్బందులేనా

నెల్లూరు, సెప్టెంబర్ 29, కూటమి ప్రభుత్వం మున్సిపల్ చట్టాలకు సవరణలు చేస్తూ మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్‌లను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించడం వైసీపీ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తోంది. పరోక్ష ఎన్నికల విధానంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలిపించుకుని, అనంతరం రాజకీయ సమీకరణాలతో , క్యాంప్ రాజకీయాలతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి , కనీసం గట్టి పోటీ ఇవ్వడానికి అవకాశముండేది. వార్డుల వారీగా పరిమిత శక్తిని ఉపయోగించి కొన్ని స్థానాలు గెలిచినా పార్టీ ఉనికి ఉందనే " సంకేతాలు ఇచ్చే అవకాశం దక్కేది. అయితే, నగర లేదా పట్టణ స్థాయి మొత్తాన్ని ఒకే నియోజకవర్గంగా భావించి జరిగే ఈ ప్రత్యక్ష పోరులో విజయం సాధించాలంటే విస్తృతమైన ప్రజాదరణతో పాటు సమగ్రమైన యంత్రాంగం అవసరం. ఇది ప్రతిపక్షంలో ఉన్న వైసీపీకి అతిపెద్ద సమస్యగా మారింది.మేయర్ , ఛైర్మన్ స్థాయి ప్రత్యక్ష ఎన్నికలంటే నగరమంతటా ప్రచారం నిర్వహించడం, భారీ ఎత్తున ఆర్థిక, అంగబలాలను సమకూర్చుకోక తప్పదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీల వైపు నుంచి నగరాల్లో పోటీకి బలమైన ఆర్థిక సామర్థ్యం, సామాజిక మద్దతు ఉన్న నేతలు సులభంగానే సిద్ధమవుతున్నారు. మరోవైపు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ తరపున అంత భారీగా ఖర్చు పెట్టి, అధికార యంత్రాంగాన్ని ఎదుర్కొని పోరాడేందుకు ఆ స్థాయి హెవీవెయిట్ అభ్యర్థులు లభించడం కష్టంగా మారింది. పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా భారీగా సొంత నిధులు వెచ్చించడానికి వెనుకంజ వేస్తుండటంతో, ప్రధాన నగరాల్లో పరువు నిలబెట్టుకునే స్థాయిలో బలమైన అభ్యర్థులను ఖరారు చేయడం పార్టీ నేతలకు పెద్ద సవాలుగా మారింది.గతంలో వార్డు స్థాయి ఎన్నికల్లో స్థానిక బలగాలు, వ్యక్తిగత సంబంధాలు పనిచేసేవి. కానీ ఇప్పుడు మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికల వల్ల ఓటర్ల దృష్టి వార్డు సభ్యుల కంటే ప్రధాన పదవిపైనే ఎక్కువ కేంద్రీకృతమవుతుంది. నగరవ్యాప్తంగా అధికార పార్టీ వీచే గాలి , అభ్యర్థి ప్రాభవం ఆటోమేటిక్‌గా కింద ఉన్న వార్డు కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలపై కూడా ప్రభావం చూపుతుంది. మేయర్ అభ్యర్థికి గెలుపు అవకాశాలు లేవని భావిస్తే, అది కింది స్థాయి వార్డు అభ్యర్థుల ప్రచారంపై, అలాగే ఓటర్ల మూడ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ సమగ్ర ప్రభావం వల్లనే పలు పట్టణాల్లో వైసీపీకి చెందిన కింది స్థాయి క్యాడర్ వార్డు స్థాయి పోటీని కూడా తీవ్రంగా తీసుకోలేని నైరాశ్యంలోకి జారుకుంటోంది.ప్రత్యక్ష ఎన్నికల విధానంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికలు రావడం మంచిదేనని స్పందించారు. అయితే, పార్టీ క్షేత్రస్థాయి బలాబలాలు, నగర ప్రాంతాల్లో ఉండే ప్రతికూల వాతావరణం, అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎదురయ్యే వనరుల కొరతను లోతుగా విశ్లేషించకుండానే అధినేత ఆ ప్రకటన చేశారని పార్టీ సీనియర్ నేతలు మథనపడుతున్నారు. నాయకులకు కేవలం ఆదేశాలు ఇవ్వడమే తప్ప, ప్రతిపక్షంలో ఉన్న ఈ క్లిష్ట సమయంలో అభ్యర్థులకు అవసరమైన ఆర్థిక లేదా క్షేత్రస్థాయి రక్షణ బాధ్యతను పార్టీ కేంద్ర నాయకత్వం ప్రత్యక్షంగా తీసుకుంటుందనే స్పష్టమైన అభయాన్ని ఇవ్వలేకపోతున్నారు. అందుకే లోకల్ పోరును సీరియస్‌గా తీసుకోకుండా నామమాత్రంగా వైసీపీ క్యాడర్ పరిగణిస్తోంది.

# సీఈసీపై చెరో దారి...

తిరుపతి, సెప్టెంబర్ 29 కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ విషయంలో వచ్చిన ఆరోపణలు ఏపీలో ఏ రాజకీయ పార్టీకి కలసి వస్తాయన్న లెక్కలు వేసుకుటన్నాయి. భారత ఎన్నికల సంఘం లో అంతర్గత విభేదాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మరియు ఫామ్-6 మార్పులపై రేగిన జాతీయ స్థాయి వివాదం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జాతీయ మీడియా నివేదికల ప్రకారం.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గత 10 నెలల్లో సీఈసీ ఒంటెద్దు పోకడలపై 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారనే వార్తలతో ఏపీలోని ప్రధాన పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యూహాలు ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే ఎవరూ దీనిపై పెద్దగా బయటకు మాట్లాడకపోయినా వచ్చే ఎన్నికల్లో ఎన్నికల సంఘం అంత దూకుడుగా ఏపీలో వ్యవహరించదన్న లెక్కలు వేసుకుంటున్నారు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమకు దీనివల్ల కొంత మేరకు రాజకీయ ప్రయోజనం కలుగుతుందని భావిస్తుంది.సీఈసీపై తలెత్తిన ఆరోపణలతో తాము గత ఎన్నికల ఫలితాలకు కలిపి ముడిపెడుతూ బలం చేకూర్చే పనిలో వైసీపీ ఉంది. ప్రధానంగా సోషల్ మీడియాలో గత ఎన్నికల్లో 40 శాతం ఓట్ల షేర్ సాధించిన తమ పార్టీకి కేవలం పదకొండు సీట్లు మాత్రమే రావడం, అర్ధరాత్రి వరకూ జరిగిన ఓటింగ్, చివరి మూడు నాలుగు గంటల్లో ఒక్కసారిగా లక్షల్లో పెరిగిన ఓటింగ్ తమ ఆరోపణలకు ప్రస్తుతం సీఈసీపై తలెత్తిన వివాదం మరింత బలం చేకూరుస్తుందని అంటున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత ఎన్నికల్లో ఓట్ల అక్రమాలు జరిగాయని వైస్సార్సీపీ ఆరోపిస్తూనే ఉంది. ఇప్పుడు ఈసీలోనే అంతర్గత భేదాభిప్రాయాలు, ఓటర్ల జాబితా సవరణలపై అభ్యంతరాలు వెలుగుచూడటంతో తమ ఆరోపణలకు విశ్వసనీయత దొరికినట్లు వైస్సార్సీపీ భావిస్తోంది... అలాగే మరొకవైపు అధికార కూటమి మాత్రం తమ వాదనలను వినిపిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే వివరణ ఇస్తూ.. కమిషనర్ల మధ్య భేదాభిప్రాయాలు అంతర్గత చర్చల్లో భాగమేనని, తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది. ఏపీలోని అధికార కూటమి సైతం ఇదే లైన్ తీసుకుని, ప్రతిపక్షాలు కేవలం తమ ఓటమిని అంగీకరించలేక రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లుతున్నాయని కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి.

2019 నుంచి 2024 నుంచి జగన్ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టడం, కక్ష పూరిత రాజకీయాలు చేయడం, చంద్రబాబు అరెస్ట్ వంటి వాటివల్లనే పదకొండు సీట్లు వచ్చాయని కూటమి నేతలు వాదిస్తున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ ఈ వివాదాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రాష్ట్రంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ, జనసేనలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు మద్దతుగా నిలిచి తమ పొత్తును మరింత బలోపేతం చేసుకోవచ్చు. మొత్తం మీద కేంద్ర ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలు ఎవరికి ప్రయోజనం? ఎవరికి నష్టం? అన్న లెక్కల్లో ఎవరికి వారే ఉండటం విశేషం.

# కొంగర కుర్దు భూములు రైతులకే దక్కాలి కవిత

హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా కొంగరకుర్దు – ఏ గ్రామ భూ బాధితులతో కలిసి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మీడియా సమావేశం నిర్వహించారు. కవిత మాట్లాడుతూ కొంగరకుర్దు– ఏ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ భూ మాఫియా నడుస్తోంది. ఆ భూములు రైతులకే దక్కాలి. అధికార, ప్రతిపక్ష ముఖ్య నాయకులు వక్ఫ్ భూములు కొట్టేస్తున్నారు. నమస్తే తెలంగాణ, సాక్షిలో ఒక్క రోజు వార్తలు రాసి బీఆర్ఎస్ ముఖ్య నేత ఒత్తిడితో కబ్జా బాగోతాన్ని పక్కన పెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆర్గనైజ్డ్ గా భూ మాఫియా పెద్ద ఎత్తున భూములు కబ్జా పెడుతోందని అన్నారు.కొంగరకుర్దులో ఉన్న 580 ఎకరాల వక్ఫ్ భూమిలో ఇప్పటికే 150 ఎకరాలు భూ మాఫియా చెరలోకి వెళ్లిపోయింది. కొంగరకుర్దులోని సర్వే నంబర్లు 2 నుంచి 400 వరకు ఉన్న 580 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు చెందుతుందని 2007లోనే గెజిట్ ఇచ్చి 22ఏ లో చేర్చారు. 2022లో ఈ భూములపై మాఫియా కన్ను పడింది.. ఒక రైతు 58 ఎకరాల్లో పంటలు సాగు చేస్తే మూడు జేసీబీలతో ఆ పంటను ధ్వంసం చేసి లే అవుట్ చేశారు. బిహార్, ఉత్తర ప్రదేశ్ లో ఎంతటి దౌర్జన్య పరమైన రాజ్యం సాగుతుందో కొంగరకుర్దులో అంతే దౌర్జన్యం గా రైతులు సాగుచేసుకుంటున్న భూములు లాక్కున్నారు. భూ మాఫియా ఆగడాలపై రెవెన్యూ, పోలీస్ అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినా కనీసం కేసులు కూడా నమోదు చేయడం లేదు. కొంగరకుర్దు గ్రామంతో సంబంధం లేని వారి పేర్లతో ఓ ఆర్ సీ లు సృష్టించి వాటితో కోర్టుల్లో కేసులు వేసి అనుకూలంగా జడ్జిమెంట్ లు తెచ్చుకొని రిజిస్ట్రేషన్ లు చేయించుకుంటున్నారు. 2022 లో 22ఏ లో ఉన్న కొంగరకుర్దు భూములు రిజిస్ట్రేషన్ అయ్యాయి.. దానికి సంబంధించిన అన్ని రికార్డులు ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. అర్బన్ క్రెస్ట్, సిటీ గ్రాండ్ ఎన్ క్యూ వెంచర్స్ అనే సంస్థలు ఇక్కడ భారీ వెంచర్లు వేశాయి.. 2022 తర్వాత ఇక్కడ జరిగిన అన్ని రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో లే అవుట్ పర్మిషన్ ఎలా ఇచ్చారు.. హెచ్ఎండీఏ కమిషనర్ ఏం చేస్తున్నారని అన్నారు,

కొంగరకుర్దు రైతులను రెండు నిర్మాణ సంస్థలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కలిసి రూ.5 వేల కోట్ల విలువైన 580 ఎకరాల భూమిని కొట్టేస్తున్నారు.. బందిపోటు దొంగలు కూడా ఇలా పగటి పూట దొంగతనం చేయరు. నమస్తే తెలంగాణ లో ఒక్క రోజు ఈ భూ మాఫియాపై వార్త వచ్చింది.. అది ఒక ప్రముఖ బీఆర్ఎస్ నాయకుడి వెంచర్ .. వెనుక మరో ముఖ్య నాయకుడు ఉన్నాడు.. తెల్లారి నుంచి ఆ పేపర్ ల ఒక్క ముక్క కూడా రాయలేదు. నర్సమ్మ అనే రైతు భూమికి లక్ష్మీ అనే పేరుతో ఓ ఆర్ సీ తెచ్చుకున్నారు.. ఇలాంటి అక్రమాలు ఎన్నో కొంగరకుర్దులో జరిగాయి.. వెంటనే ఆ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి బీఆర్ఎస్ పాలనలో కొన్ని ఇండ్లే బంగారం అయ్యాయని నేను చెప్పిన దానికి ఈ కొంగరకుర్దు భూములు కూడా సాక్ష్యంగా నిలుస్తున్నాయి.. ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

# ట్రాఫిక్ చలాన్ల వసూలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

### ఈ-చలాన్లను కరెంట్ బిల్లులో కలిపేయాలని సూచన
### దేశవ్యాప్తంగా రూ.45 వేల కోట్ల చలాన్లు పెండింగ్
### చలాన్లు కట్టనివారికి ఆర్సీ రెన్యువల్ నిలిపివేయాలని సలహా

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనదారుల నుంచి ఈ-చలాన్ల వసూలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. పేరుకుపోయిన చలానాల మొత్తాన్ని వాహనదారుల విద్యుత్ బిల్లులకు జోడించి వసూలు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. దేశంలో ప్రస్తుతం అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతుల ద్వారా వసూళ్లు చేయడం కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది.దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో దాదాపు రూ.45 వేల కోట్ల విలువైన ఈ-చలాన్లు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే వసూలైనట్లు సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఈ భారీ బకాయిలపై జస్టిస్ పార్ధివాలాతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. "ఒకే మార్గంలో పయనిస్తామంటే ఈ దేశంలో సాధ్యం కాదు. ఈ-చలాన్ల మొత్తాన్ని విద్యుత్ బిల్లులతో అనుసంధానించండి" అని వ్యాఖ్యానించింది.చలాన్లు చెల్లించని వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోర్టు సూచించింది. అటువంటి వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) పునరుద్ధరణను నిలిపివేయడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని నిరాకరించడం వంటి చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. బకాయిల వసూలు కోసం అధికారులు వినూత్నమైన, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

# బోర్ మోటర్ల చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్..



రాయపోల్,సెప్టెంబర్ 29 : రైతుల వ్యవసాయ బోర్‌వెల్ మోటర్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని సిద్దిపేట జిల్లా రాయపోల్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.1.13 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తొగుట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కే. లతీఫ్ సోమవారం వివరాలను వెల్లడించారు. గత కొంతకాలంగా రాయపోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి మొత్తం ఐదు చోరీ కేసులకు పాల్పడిన పురుషోత్తం బాబు (37) అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో చోరీల వైపు మళ్లిన నిందితుడు, తన ద్విచక్ర వాహనంపై గ్రామ శివార్లలోని వ్యవసాయ భూములకు వెళ్లి బోర్ మోటర్లను రంపం సహాయంతో కట్ చేసి అపహరించేవాడు. అనంతరం వాటిని ఇనుప సామగ్రి కొనుగోలు చేసే గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించి వచ్చిన డబ్బును ఖర్చు చేసేవాడని విచారణలో వెల్లడైంది. ఇటీవల లింగారెడ్డిపల్లి గ్రామ శివారులో చోరీ చేసిన మోటరును గజ్వేల్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్న సమయంలో కొత్తపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీలను గమనించి పారిపోవడానికి ప్రయత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని పట్టుకుని తనిఖీ చేయగా, బైక్‌పై ఒక మోటర్‌తో పాటు చోరీలకు ఉపయోగించిన రంపం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విచారణలో గత కొన్ని నెలలుగా జరిగిన చోరీలకు తానే పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# కుటుంబ కలహాలతో భర్త హత్య రోకలిబండతో కొట్టి చంపిన భార్య?

మంచిర్యాల, సెప్టెంబర్ 29 : మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్‌లో దారుణ ఘటన చోటుచేసు కుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో వైద్య మోహన్(40) అనే వ్యక్తిని అతడి భార్య రోకలిబండతో కొట్టి హత్య చేసినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన మోహన్ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న మంచిర్యాల పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే హత్యకు కారణమా? మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా, మృతుడు వైద్య మోహన్ ఓ యూట్యూబ్ ఛానల్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హిందూ దేవుళ్లనై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

హైదరాబాద్ రేవంత్ రెడ్డి దేవుళ్ల పై చేసిన వ్యాఖ్యలు హిందూ ధర్మానికి అవమానమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు అన్నారు. గతంలో కూడా తాగేవాళ్ల కు ఒక దేవుడు అని అవమాన కరం గా మాట్లాడారు . ఖైరతా బాద్ ఎన్నికల దృష్టి తో ముస్లింల ఓటు బ్యాంకు కోసం చేస్తున్న వ్యాఖ్యలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని బిజెపి కార్యకర్తలకు పిలుపునిస్తున్నామని అన్నారు.

# శ్రీకాళహస్తి పురపాలక అధికారి వ్యవహారం వివాదాస్పదం

### మద్యం మత్తులో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఫోన్ చేసినట్లు ఆరోపణ
### ఫోన్‌లో దుర్భాషలు, బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు
### సదరు అధికారిని అదుపులోకి తీసుకుని పోలీసుల విచారణ
### ఘటనపై పూర్తి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది

.శ్రీకాళహస్తిలో ఓ పురపాలక అధికారి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మద్యం మత్తులో స్థానిక ప్రజాప్రతినిధికి ఫోన్ చేసి దుర్భాషలాడటంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి సదరు అధికారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.శ్రీకాళహస్తి పురపాలక కార్యాలయంలో ఆర్ఐ స్థాయి అధికారిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి వ్యవహారం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారి, స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఫోన్ చేసి దుర్భాషలాడటంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.ఈ వ్యవహారం పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారు రంగంలోకి దిగి సదరు అధికారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం.ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ప్రజాప్రతినిధితో అనుచితంగా వ్యవహరించారనే ఆరోపణలపై పట్టణంలో చర్చ జరుగుతోంది.అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, కేసులో నమోదైన సెక్షన్లు, అధికారి వివరణ తదితర అంశాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.ఈ ఘటనపై పోలీసుల విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# వరల్డ్ హార్ట్ డే: కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వాకథాన్ - 300 మందితో అవగాహన ర్యాలీ

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కేర్ హాస్పిటల్స్, మలక్ పేట ఆధ్వర్యంలో గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు హార్ట్ హెల్త్ వాకథాన్ ను ఘనంగా నిర్వహించారు.మీ హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి వాకింగ్" అనే థీమ్ తో నిర్వహించిన ఈ వాకథాన్ ను ప్రారంభించారు.ఆస్పత్రి నుండి ప్రారంభమైన ర్యాలీలో వైద్యులు, సిబ్బంది, చుట్టుపక్కల నివాసితులు సహా సుమారు 300 మంది చురుకుగా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ "గుండెపోటు, స్ట్రోక్ లతో సహా కార్డియోవాస్కులర్ వ్యాధులు అకాల మరణాలకు ప్రధాన కారణం. అధిక రక్తపోటు, ఊబకాయం, మధుమేహం, ఒత్తిడి, లక్షణాలను విస్మరించడం, జంక్ ఫుడ్స్, స్వీయ మందులు, నిశ్చల జీవనశైలి – ఇవన్నీ మన గుండెలకు ప్రమాదం" అని అన్నారు."ఈ వాకథాన్ ద్వారా ప్రజలు తమ గుండె ఆరోగ్యాన్ని స్వయంగా చూసుకునేలా ప్రేరేపించడం, జీవనశైలిలో చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా గుండెను కాపాడుకోవచ్చని తెలియజేయడమే మా లక్ష్యం. ఏ చిన్న మార్పు అయినా మన మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తుంది" అని పేర్కొన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై ఆగ్రహం

జనగామ మండలం ఎల్లంల గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల ఎంపికలో తన పేరు రాలేదని మనస్తాపానికి గురైన బిర్రు రాజు గ్రామపంచాయతీ ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే అడ్డుకున్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేదని ఆరోపిస్తూ.. అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని రాజు డిమాండ్ చేశాడు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను గ్రామసభ ద్వారా పారదర్శకంగా చేపట్టాలని, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేసారు.

# రైలు ఢీకొని 100కుపైగా గొర్రెలు మృతి



మేడ్చల్ రైలు ఢీకొని వందకు పైగా గొర్రెలు మృతి చెందాయి మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా ఔషాపూర్ సమీపంలోని కేపాల్ వద్ద తెల్లవారుజామున ఘటన జరిగింది. దక్షిణ్ ఎక్స్ప్రెస్ రైలు శబ్దానికి బెదిరిన గొర్రెల మంద పట్టాలపైకి పరుగులు తీయడంతో రైలు ఢీకొట్టి 100కుపైగా గొర్రెలు మృతి చెందాయి.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు హెల్ప్ డెస్క్ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రారంభించారు. పట్టభద్రులందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని జగదీష్ రెడ్డి కోరారు. పాత గ్రాడ్యుయేట్ ఓటర్ జాబితా రద్దైనందున పాత, కొత్త ఓటర్లు కూడా మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, బీఆర్ఎస్ పోరాట పటిమను గమనించి పట్టభద్రులు తమ నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డె స్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# ఆ పోలీసులను గుర్తించండి డీజీపీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసిన పోలీసులను గుర్తించండని డీజీపీకి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలీసులపై తీసుకునే చర్యల రిపోర్టును స్పీకర్ ముందు ఉంచండని ఆదేశించింది. మహిళా ఎమ్మెల్యేలు పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించినట్టు ఎక్కడా ఆధారాలు లేవని హైకోర్టు తేల్చి చెప్పింది.

# కేటీఆర్ హయాంలో దళితులకు అన్యాయం

రాజన్న సిరిసిల్ల: సిరిసిల్ల నియోజకవర్గంలో దళితులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ ఏనాడు పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ నెల 30న సిరిసిల్లలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర, భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ? 2014 నుంచి 2023 వరకు పదేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సిరిసిల్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని భావించామని, కానీ క్షేత్రస్థాయి పరిస్థితి వేరుగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సభ ఏర్పాట్ల నిమిత్తం గడిచిన వారం రోజులుగా సిరిసిల్లలో పర్యటిస్తుంటే తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి విజ్ఞప్తులు చేస్తున్నారని తెలిపారు.?ముఖ్యంగా దళితులు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై కేటీఆర్‌కు ఎలాంటి చిత్తశుద్ధి లేదని స్థానిక సంఘటనలు స్పష్టం చేస్తున్నాయని ఆరోపించారు. సిరిసిల్లలో కరకట్ట నిర్మాణంతో పాటు సీవరేజ్ ప్లాంట్ నిర్మాణం వల్ల దళితులకు కేటాయించిన దాదాపు 300 ఎకరాల అసైన్డ్ భూములు సాగుకు నోచుకోకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోవడంతోనే, నేడు ప్రజలు తమ వద్దకు వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారని పేర్కొన్నారు.?సిరిసిల్ల నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నెల 30న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరగనున్న ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు, దళితులు, బలహీన వర్గాలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# కన్నయ్య, జాఖడ్‌లకు రాహుల్ ప్రశ్నలు

**ఎన్నికల వ్యూహంపై వివరణ కోరిన నాయకత్వం**

**దీపాంశు షోకీన్ అంశంపైనా చర్చమూడు పదవులు**

**దక్కించుకున్న ఏబీవీపీ**

**స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఉపాధ్యక్షుడైన షోకీన్**

ఢిల్లీ : ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (డీయూఎస్‌యూ) ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ ఎదుర్కొన్న పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరా తీశారు. ఎన్నికల్లో గెలుపు అంచనాలతో బరిలోకి దిగిన ఎన్ఎస్‌యూఐ ఒక్క కేంద్ర పదవినీ దక్కించుకోకపోవడంతో పార్టీ నాయకత్వం దీనిపై సమీక్ష చేపట్టింది. ఈ క్రమంలో ఎన్ఎస్‌యూఐ ఇన్‌ఛార్జ్ కన్నయ్య కుమార్, జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖడ్‌లతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. సమావేశంలో కన్నయ్య కుమార్, వినోద్ జాఖడ్‌లను రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు అడిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా అధ్యక్ష పదవికి ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి చివరి వరకు గట్టి పోటీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. 'అధ్యక్ష పదవిని గెలిచేందుకు చాలా దగ్గరగా వచ్చాం. తర్వాత ఏం జరిగింది?' అని ఆయన ప్రశ్నించినట్లు వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహం వంటి అంశాలపై కూడా రాహుల్ గాంధీ వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు సమయంలో కన్నయ్య కుమార్ బాధ్యత తీసుకున్నారని కేసీ వేణుగోపాల్ ప్రస్తావించినట్లు సమాచారం. ఎన్నికల ముందు ఉన్న అంచనాలకు భిన్నంగా ఫలితాలు ఎందుకు వచ్చాయనే దానిపై ఆయన వివరణ కోరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. డీయూఎస్‌యూ కేంద్ర ప్యానెల్‌లో నాలుగు పదవులు ఉన్నాయి. అధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను



ఏబీవీపీ గెలుచుకుంది. ఉపాధ్యక్ష పదవిని స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ గెలుచుకున్నారు. ఎన్ఎస్‌యూఐ ఒక్క పదవినీ దక్కించుకోలేకపోయింది. మాజీ ఎన్ఎస్‌యూఐ సభ్యుడు దీపాంశు షోకీన్ స్వతంత్రంగా పోటీ చేసి ఉపాధ్యక్ష పదవిని గెలవడం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. 2023, 2024 డీయూఎస్‌యూ ఎన్నికల్లో షోకీన్ ఎన్ఎస్‌యూఐ తరపున ప్రచారం చేశారు. ఈసారి టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయన 30,615 ఓట్లు సాధించి ఏబీవీపీ అభ్యర్థిపై 13,705 ఓట్ల భారీ తేడాతో గెలిచారు. ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి 4,313 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. షోకీన్‌ను పార్టీలో ఎందుకు కొనసాగించలేకపోయారని రాహుల్ గాంధీ ప్రశ్నించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన పెట్టిన కొన్ని షరతులు ఆమోదయోగ్యంగా లేవని కన్నయ్య కుమార్, జాఖడ్ వివరించినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారాన్ని నిర్వహించిన తీరుపై రాహుల్ సంతృప్తి చెందలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. యువతతో మరింతగా మమేకం కావడానికి కాంగ్రెస్ ఇటీవల పలు కార్యక్రమాలు చేపడుతోంది. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో 'ఛాత్రోన్ కీ గూంజ్' పేరుతో విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ నగరాల్లో యువతతో సంబంధాలు పెంచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీయూఎస్‌యూ ఫలితం పార్టీ యువజన విభాగం బలంపై చర్చకు దారితీసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా జెన్-జీ యువత రాజకీయ అంశాలపై చూపుతున్న ఆసక్తి, విద్యార్థి ఉద్యమాలపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.డీయూఎస్‌యూ అధ్యక్ష పదవిలో ఏబీవీపీకి చెందిన యశ్ దబాస్ 24,576 ఓట్లు సాధించగా, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనా 22,523 ఓట్లు పొందారు. దీంతో 2,053 ఓట్ల తేడాతో దబాస్ విజయం సాధించారు. ఈ ఫలితాల నేపథ్యంలో ఎన్ఎస్‌యూఐ ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, సంస్థాగత బలం వంటి అంశాలను కాంగ్రెస్ నాయకత్వం సమీక్షిస్తున్నట్లు సమాచారం.

# అధికార పార్టీలకు మైలేజీ ఇస్తుందా

హైదరాబాద్, సెప్టెంబర్ 29, ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడం వెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగా విభజించారు. ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్ వార్డు స్థాయి ఎన్నికల సరళి వేరు. కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొంత కలకలం రేపాయి. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమోననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న బలమైన కేడర్ కొరత. గతంలో ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యంత్రాంగం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కొంతమంది విలీనమైనప్పటికీ, వార్డు స్థాయిలో 300 వార్డుల పరిధిలో సరైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు ఐక్యతాపరంగా పెద్ద సవాలుగా మారనుంది. పార్టీ అంతర్గత విభేదాలు బయటపడితే గ్రేటర్ గెలుపుపై ప్రభావం పడుతుందనే యోచనలో నాయకత్వం ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్‌కు లిట్మస్ టెస్ట్‌గా మారబోతోంది. ఒకవేళ ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ , కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తే, ఆ పొలిటికల్ వేవ్‌ను వాడుకుని తక్షణమే గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అప్పటివరకు న్యాయస్థానాల్లో ఉన్న లీగల్ అడ్డంకులను క్లియర్ చేసి, వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.రాబోయే 3 నుంచి 4 నెలల్లో ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు గ్రేటర్ సమరంపై రేవంత్ రెడ్డి సర్కార్ ఒక స్పష్టమైన నిర్ణయానికి రాక తప్పదు.

# గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడులు

నర్సింహులపేట: గుడుంబా తయారీ, విక్రయాలపై నర్సింహులపేట పోలీసులు కొరడా ఝుళిపించారు. కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం గోపా తండా గ్రామపంచాయతీ పరిధిలోని చింతల తండా, అమిరియా తండా, కొత్త తండాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 2 వేల లీటర్ల బెల్లం వాష్‌ను పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే 3 క్వింటాళ్ల నల్ల బెల్లం, 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 15 మంది వ్యక్తుల వద్ద ఈ పదార్థాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తుల పూర్వ నేర చరిత్ర, బైండ్‌ఓవర్ వివరాలను పరిశీలించి, చట్ట ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడుల్లో తొర్రూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గణేష్‌తో పాటు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిరిసిల్లలో రేవంత్ అసలు టార్గెట్ ఇదేనా?

# కేటీఆర్ కోటనే ఎందుకు ఎంచుకున్నారు?

హైదరాబాద్, సెప్టెంబర్ 29, తెలంగాణ రాజకీయం ప్రస్తుతం బీఆర్ఎస్ కీలక నాయకుల సొంత నియోజకవర్గాల చుట్టూ తిరుగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుసగా నాలుగుసార్లు ప్రాతినిధ్యం వహించిన సిరిసిల్ల స్థానంలో సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. సుమారు రూ. 1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభను కాంగ్రెస్ ప్లాన్ చేసింది. పదేళ్ల పాలనలో కేటీఆర్ సిరిసిల్లను ఆదర్శంగా తీర్చిదిద్దామని చెప్పుకుంటుంటే, నాలుగుసార్లు గెలిపించిన ప్రజలకు సరైన అభివృద్ధి చేయలేదు అని రేవంత్ ప్రభుత్వం కౌంటర్ ఇస్తోంది. కేటీఆర్ గడపలోనే ఆయన వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా రాజకీయంగా మానసిక ఆధిపత్యం సాధించాలనేది కాంగ్రెస్ ప్రధాన వ్యూహం. సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించబోయే సభ సాధారణ ప్రభుత్వ కార్యక్రమంగానో లేదా పార్టీ సభగానో కాకుండా అంతకు మించి ఉండబోతోందన్న సంకేతం కనిపిస్తోంది. ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఇదే చర్చ కూడా. ఎందుకంటే రేవంత్ ఎంచుకున్నది సాధారణ నియోజకవర్గం కాదు. అది కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల.అక్కడే భారీ బహిరంగ సభ.. దానికి ముందు నాలుగు కిలోమీటర్ల రోడ్‌షో.. రాష్ట్రంలోని కీలక మంత్రులు, కాంగ్రెస్ నేతల మోహరింపు.. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల నుంచి జన సమీకరణ.. ఇవన్నీ చూస్తే రేవంత్ పర్యటనను కేవలం అభివృద్ధి కార్యక్రమాల పర్యటన కాదు.. మరోవైపు బీఆర్ఎస్ కంచుకోటలో కాంగ్రెస్ రాజకీయ శక్తిని ప్రదర్శించడ కూడా ఈ సభలోని రెండు ప్రధాన లక్ష్యాలు.కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం, వచ్చే ఏడాది నుంచి నీటి నిల్వరేవంత్‌కు సిరిసిల్లలో ఒక ప్రత్యేక రాజకీయ లెక్క ఉంది. కేటీఆర్‌కు ఇది కేవలం ఎమ్మెల్యే నియోజకవర్గం కాదు. 2009, 2014, 2018, 2023 ఎన్నికల వరకు సిరిసిల్లలో కేటీఆర్ వరుస విజయాలు సాధించారు. అంటే సిరిసిల్లలో కేటీఆర్ అజేయుడు కాదనే పొలిటికల్ నరేటివ్ సృష్టించడం రేవంత్ ముఖ్య వ్యూహం కావచ్చు. రాజకీయాల్లో ప్రత్యర్థి బలహీనంగా ఉన్న చోట బలం చూపించడం పెద్ద విషయం కాదు. ప్రత్యర్థి బలమైన చోటికి వెళ్లి బలం చూపించడమే పెద్ద మెసేజ్ ఇస్తుంది. రేవంత్ సిరిసిల్ల ద్వారా అదే సందేశాన్ని ఇవ్వాలని చూస్తున్నారా? అనేది ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్న.సిరిసిల్ల సభను కేవలం రేవంత్ వర్సెస్ కేటీఆర్‌గా చూడటం ఈ వ్యూహాన్ని చిన్నదిగా చూసినట్టే. రేవంత్ లక్ష్యం బీఆర్ఎస్ రాజకీయ మానసిక ఆధిక్యాన్ని సవాలు చేయడం కావచ్చు. కేటీఆర్ సిరిసిల్లలో గెలవడం ఒక ఎన్నికల ఫలితం.కానీ "కేటీఆర్ అంటే సిరిసిల్ల.. సిరిసిల్ల అంటే కేటీఆర్" అనే రాజకీయ ఇమేజ్‌ను మార్చడం మాత్రం చాలా పెద్ద రాజకీయ విజయం అవుతుంది. అందుకే సభకు వచ్చే జనసందోహం, రోడ్‌షోలో కనిపించే స్పందన, స్థానిక నేతల పాల్గొనడం, కేటీఆర్‌పై రేవంత్ చేసే రాజకీయ దాడి కంటే కూడా సిరిసిల్ల ప్రజల్లో కాంగ్రెస్‌కు పొలిటికల్ స్పేస్ ఎంత? అన్నదే కాంగ్రెస్‌కు ముఖ్యమైన కొలమానం.ఇక్కడ మరో కీలక అంశం ఉంది. సిరిసిల్ల సభను కాంగ్రెస్ ఒక నియోజకవర్గ కార్యక్రమంగా కాకుండా రాష్ట్రస్థాయి పవర్ షోగా మలచడానికి ప్రయత్నిస్తోంది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నాలుగు కిలోమీటర్ల రోడ్‌షోతో పాటు భారీ జన సమీకరణకు కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది.అంటే "కేటీఆర్‌ను ఓడించగలమా?"×× అన్నదానికంటే ముందుగా.."కేటీఆర్ కోటలో కాంగ్రెస్ ఎంత పెద్ద రాజకీయ శక్తిగా కనిపించగలదు? అన్న ప్రశ్నకు సమాధానం చూపించాల్సిన వేదికగా సిరిసిల్లను మలుస్తున్నట్టు కనిపిస్తోంది.ఈ వ్యూహం ఒక్కరోజులో పుట్టింది కాదు. సెప్టెంబర్ 5న నకిరేకల్ సభలోనే రేవంత్‌రెడ్డి సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌లను ప్రస్తావించారు. సిరిసిల్లలో కేటీఆర్‌ను, సిద్ధిపేటలో హరీశ్‌రావును, గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. సిరిసిల్లకు సెప్టెంబర్‌లో, సిద్ధిపేటకు అక్టోబర్‌లో వెళ్తానని చెప్పారు. అంటే సిరిసిల్ల ఒక టెస్ట్ కేసు.ఇక్కడ కాంగ్రెస్ నిర్వహించే సభకు వచ్చే స్పందన ఎలా ఉంటుంది? స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఎంతవరకు సమన్వయంతో పనిచేస్తుంది? కేటీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న స్థానిక అసంతృప్తిని కాంగ్రెస్ ఎంతవరకు రాజకీయంగా ఉపయోగించుకోగలదు? ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎంతవరకు కనెక్ట్ చేయగలదు? ఈ ప్రశ్నలకు సిరిసిల్లలో రేవంత్‌కు వచ్చే సమాధానం తర్వాతి అడుగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

రేవంత్ సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ సభల ద్వారా మూడు రాజకీయ సందేశాలను పంపాలనుకుంటున్నారు. 1. బీఆర్ఎస్ కోటల్లోకీ కాంగ్రెస్ వస్తుంది, ఇది కేటీఆర్‌కు మాత్రమే కాదు.. బీఆర్ఎస్ కేడర్‌కు కూడా ఇచ్చే సందేశంగా చూడొచ్చు. 2. కాంగ్రెస్ కేవలం అధికారంలో ఉన్న పార్టీ కాదు.. ఎన్నికల మోడ్‌లో ఉన్న పార్టీ అని చెప్పడం అది పార్టీ కేడర్‌కు కూడా ఒక మెసేజ్ ఇస్తుంది. 3. బీఆర్ఎస్ పునరాగమనానికి అవకాశం లేదన్న నరేటివ్ సృష్టించడం. ఇక్కడే సిరిసిల్ల సభ మరింత ఆసక్తికరంగా మారింది. పైగా ఇప్పుడు ఏం చేస్తారన్నది ఆసక్తిగా మారింది. రేవంత్ "నేను నీ కోటలోకి వస్తున్నా" అనే రాజకీయ సందేశం ఇవ్వబోతుంటే.. కేటీఆర్ మాత్రం "వస్తున్నారు కదా.. మా ప్రశ్నలకు సమాధానం చెప్పండి" అంటూ చర్చను మరో ట్రాక్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. సెప్టెంబర్ 27న కేటీఆర్ రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలపై ఆధారాలు ముందు పెట్టాలని కోరారు. అక్కడితో ఆగలేదు. సిరిసిల్ల నేతన్నలకు కోట్ల రూపాయల బకాయిలు, యార్న్ సబ్సిడీ, నేతన్న బీమా, వీవింగ్ పార్క్, రైతు భరోసా, రుణమాఫీ తదితర అంశాలపై కూడా సీఎం సమాధానం చెప్పాలని కోరారు. అంటే ఇప్పుడు రేవంత్ ముందున్న రాజకీయ సవాలు కొంత మారింది.ఇక్కడే సెప్టెంబర్ 30 ప్రసంగం కీలకంగా మారనుంది. రేవంత్ కేవలం "కేటీఆర్ ఓడిపోతారు" అని మాట్లాడితే అది సాధారణ రాజకీయ విమర్శగా మిగిలిపోవచ్చు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ ప్రభుత్వంలో నిధులన్నీ గజ్వేల్, సిద్ధిపేట, సిరిసిల్లలకే వెళ్లాయి.. అభివృద్ధి అంటే ఈ మూడు నియోజకవర్గాలేనా అన్న ప్రశ్న ఎదురైంది. అలాంటి పరిస్తితుల్లో రేవంత్ అక్కడికెళ్లి స్దానికులకు కొత్తగా ఏం హామీలివ్వగలరు. కానీ సిరిసిల్లకు సంబంధించిన స్పష్టమైన లెక్కలు చెబితే? ఎన్ని పనులు చేశాం? ఎన్ని నిధులు ఇచ్చాం?ఏ ప్రాజెక్టుకు ఎంత ఖర్చు చేశాం? నేతన్నలకు ప్రభుత్వం ఏం చేసింది? రాబోయే రోజుల్లో ఏం చేయబోతున్నాం? ఇలా సిరిసిల్లకే ప్రత్యేకమైన లెక్కలతో మాట్లాడితే సభకు వేరే రాజకీయ బలం వస్తుంది. అందుకే రేవంత్ ప్రసంగంలోని రాజకీయ పంచ్‌లపై మాత్రమే కాదు.. ఆయన చెప్పబోయే సిరిసిల్ల స్పెసిఫిక్ డేటాపైనా ఇప్పుడు అందరి దృష్టి ఉంది.ఇది బహుశా మొత్తం వ్యూహంలో అత్యంత ముఖ్యమైన అంశం. ఈ మూడు నియోజకవర్గాలు ఒకే రాజకీయ కుటుంబం, ఒకే పార్టీ అగ్రనాయకత్వంతో బలంగా అనుసంధానమై ఉన్నాయి. అందుకే రేవంత్ ఈ మూడు ప్రాంతాల్లో వరుసగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తే అది కేవలం నియోజకవర్గాల పర్యటన కాదు. బీఆర్ఎస్ రాజకీయ కేంద్రాల చుట్టూ కాంగ్రెస్ తన రాజకీయ కథనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ రాజకీయ చర్చలో ప్రధాన ప్రశ్న "కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది?" అని రేవంత్ సిరిసిల్ల-సిద్ధిపేట వ్యూహం ఆ చర్చను మరో ప్రశ్నవైపు తిప్పాలనుకుంటున్నారు. "2028లో బీఆర్ఎస్ తిరిగి వస్తుందా?" లేదా "కాంగ్రెస్ బీఆర్ఎస్ బలమైన కోటలను కూడా బద్దలు కొట్టగలదా?" ఇది కాంగ్రెస్‌కు అనుకూలమైన చర్చగా మారుతుందా, బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఉపయోగపడుతుందా అన్నది భవిష్యత్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. రెండు పార్టీల మధ్య 2028 పోటీకి దేఖ్ లేంగే నినాదం మాత్రం మొదలైంది. ఈ ప్రశ్నకు సమాధానం ఈ వరుస సమావేశాలు చేప్తాయి.. వేలకోట్ల నిధులతో అభివృద్ధి చేసిన నియోజకవర్గాల్లో రేవంత్ స్థానికంగా ఎంత బల ప్రదర్శన చేయగలరు. వాటి ప్రభావంతో ఆయా నియోజకవర్గాల్లో బీఆరెస్ స్థైర్యాన్ని దెబ్బతీయగలరా. భారీ జనసమీకరణ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలకు నూతన ఉత్సాహాన్ని నింపగలరా అనేది ఈ సభల విజయాపజయాలు నిర్ణయించనుంది. మొత్తానికి దూకుడుకు మారు పేరైన రేవంత్ రాజకీయ వ్యూహాలు ఈ కొత్త దూకుడుతో ఏం చేస్తారో చూడాలి.

## పొంగులేటి పై చర్యలకు సిద్ధమేనా

హైదరాబాద్, సెప్టెంబర్ 29,హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ఆందోళన చర్చనీయాంశమైంది. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన ఈడీ విచారణపై ఆరా తీస్తామంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున ఈడీ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించారు. రెండేళ్ల క్రితం జరిగిన సోదాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలు తమకు చెప్పాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు.సోమవారం ఉదయం ఈడీ కార్యాలయం బయట బీఆర్ఎస్ నేతలు బైఠాయించి నినాదాలు చేస్తుండటంతో పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, ఎమ్మెల్సీలు శంబిపూర్ రాజు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొని పోలీసుల తీరుపై వాగ్వాదానికి దిగారు. అయితే, ఆ తర్వాత పోలీసుల అనుమతితో ఒక ప్రతినిధి బృందం ఈడీ అధికారులను కలిసే అవకాశం కల్పించారు. అయినా హడావుడి కోసం రోడ్డుపై బైఠాయించి ధర్నాచేసారు. కాంగ్రెస్ మంత్రులకు ఒక రకమైన న్యాయం, ప్రతిపక్ష నేతలకు మరో రకమైన న్యాయం జరుగుతోందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో విమర్శలు చేశారు.చట్టబద్ధంగా నడిచే కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరులో జోక్యం చేసుకునే హక్కు ఏ రాజకీయ పార్టీకి ఉండదు. దర్యాప్తు ఏ దశలో ఉందనే అంశాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఈడీకి ఉండదు. కానీ, కేవలం రాజకీయంగా ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలనే ఉద్దేశంతో, తాము చెప్పినట్టుగానే దర్యాప్తు సంస్థలు పనిచేయాలని బీఆర్ఎస్ నేతలు ఒత్తిడి తెస్తుండటం విచిత్రంగా ఉందన్న వాదన వినిపిస్తోంది. ఒకవైపు సొంత పార్టీ నేతలు ఎదుర్కొంటున్న కేసుల విచారణ సమయంలో దర్యాప్తు సంస్థలను తప్పుపట్టిన గులాబీ నేతలు, ఇప్పుడు ఇతర పార్టీల నేతల విషయంలో తామే జ్యుడీషియరీగా మారిపోయి తీర్పులు చెప్పాలని చూస్తున్నారని అంటున్నారు.

# రీ చార్జీలకు 30 రోజుల వ్యాలిడిటీ
# టెలికాం కంపెనీలను ఆదేశించ్చైనా ట్రాయ్




హైదరాబాద్, సెప్టెంబర్ 29: మొబైల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు ట్రాయ్ గుడ్ న్యూస్ చెప్పింది. 30 రోజుల వ్యాలిదిటీతో రీఛార్జ్ ప్లాన్లు, అలాగే వాయిస్, మెసేజ్ 3 మాత్రమే ఉండే ప్లాన్లు అందుబాటులోకి తీసుకురావాలని టెలికాం కంపెనీలను ట్రాయ్ ఆదేశించింది. టెలికాం వినియోగదారుల సెక్యూరిటీ (13వ సవరణ) నిబంధనలు, 2026ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడించారు. ఈ కొత్త నిబంధనల ద్వారా వినియోగదారులకు ఎంతో లబ్ది చేకూరుతుందని ఆయన తెలిపారు. గతంలో నెలవారీ రీఛార్జ్ పేరుతో వినియోగదారులు ఏడాదికి 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై ఆ సమస్య ఉండదని రాఘవ్ వద్దా తెలిపారు. ట్రాయ్ కొత్త నిబంధనలతో 30 రోజుల రీఛార్జ్ ప్లాన్స్,యిస్ ఓన్లీ ప్లాన్లను ప్రవేశపెట్టాలని ట్రాయ్ ని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ ప్లాన్లలో ఇన్కమింగ్ అవుట్గోయింగ్ సేవలు రెండూ అందుబాటులో ఉంటాయని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు, బడ్జెట్లో ఉండే మొబైల్ యూజర్లకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పరిమితమైన రీచార్జ్ ఎంపికలపై ప్రజల నుంచి వచ్చిన అందోళనలను తాను మార్చి 11న పార్లమెంట్ లో లేవనెత్తానని రాఘవ్ చద్దా తెలిపారు. ప్రజల డిమాండ్లను నెరవేర్చిన కేంద్ర ప్రభుత్వానికి, ట్రాయికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్మాణాత్మక రాజకీయాలకు ఇదొక గొప్ప నిదర్శనమని ఆయన అన్నారు.

అందుబాటులోకి రావడంతో, ఇకపై వినియోగదారులు సంవత్సరానికి 13 సార్లు కాకుండా కేవలం 12 సార్లు మాత్రమే రీఛార్జ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

## 18 ఏళ్లు నిండిన వారికే శోషల్ మీడియా
## పరిశీలించాలని కేంద్రానికి సూచించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లి సెప్టెంబర్ 29 :సోషల్ మీడియా అకౌంట్లను వాడేందుకు 18 ఏళ్లు నిండి ఉండాలన్న నిబంధనను పరిశీలించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. మైనర్లకు సంబంధించిన భారతీయ చట్టాలను ాపీ ప్లాట్ఫామ్లు తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది.

డిజిటల్ ప్లాట్ఫామ్లలో పిల్లలకు రక్షణ కల్పించాలని దాఖలైన పిటిషన్పై ధర్మాసనం విచారణ జరిపింది. ాపీ అకౌంట్లకు పేరెంట్స్ అనుమతి తప్పనిసరి చేసేలా ఫ్రేమ్ వర్క్ రూపొందిస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

# ఆత్మవిశ్వాసం.. నిరంతర సాధనతో పోలీస్ ఉద్యోగం సాధ్యమే

### పక్కా ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి
### ప్రముఖ హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం
### పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్--రైట్ ఛాయిస్ ఉచిత కోచింగ్ శిబిరంలో ప్రత్యేక బోధన

ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పక్కా ప్రణాళికతో నిరంతర సాధన చేస్తే ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధ్యమేనని ప్రముఖ హిస్టరీ ఫ్యాకల్టీ, రచయిత డాక్టర్ అబ్దుల్ కరీం అన్నారు. పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్--రైట్ ఛాయిస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ శిబిరంలో మంగళవారం ఆయన అభ్యర్థులకు హిస్టరీ ప్రత్యేక తరగతులు నిర్వహించారు.



పోటీ పరీక్షల్లో చరిత్రను సులభంగా, సమర్థవంతంగా చదివేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. కాలక్రమం, ముఖ్య సంఘటనలు, వాటి కారణాలు, ఫలితాలను అర్థం చేసుకుంటూ చదవాలని సూచించారు. మ్యాప్‌లు, టైమ్‌లైన్‌లను ఉపయోగించుకోవడం ద్వారా అంశాలను సులభంగా గుర్తుంచుకోవచ్చన్నారు. పోలీస్ నియామక పరీక్షల్లో చరిత్ర నుంచి ప్రశ్నలు ఏ విధంగా అడుగుతున్నారో, వాటిని ఎలా విశ్లేషించి సమాధానం ఇవ్వాలో అభ్యర్థులకు వివరించారు.



ప్రామాణిక పుస్తకాలను ఎంపిక చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు ప్రతిరోజూ పునశ్చరణ, మాక్ టెస్టులు నిర్వహించుకోవాలని సూచించారు. పరీక్షకు చివరి వరకు సమయం వృథా చేయకుండా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను పూర్తి చేసుకోవాలని తెలిపారు.

రైట్ ఛాయిస్ చైర్మన్ మెండెం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ..

ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో సివిల్స్ అభ్యర్థులకు తరగతులు నిర్వహిస్తున్న డాక్టర్ అబ్దుల్ కరీం సార్ ఖమ్మం వచ్చి ప్రత్యేకంగా బోధించడం అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీతో శిక్షణ అందించడంతో పాటు అభ్యర్థులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ ఉన్న నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ, వారి ఉద్యోగ సాధనకు ప్రోత్సాహం అందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# పెనుభారంగా వైద్యం
## (హెచ్.ప్రతాప్)

ఒకప్పుడు అనారోగ్యం అంటే ఆరోగ్య సమస్య మాత్రమే. కానీ నేడు తెలంగాణలో అనారోగ్యం అంటే కుటుంబాలకు ఆర్థిక సంక్షోభంగా మారుతోంది. ఆసుపత్రి బిల్లులు, మందుల ఖర్చులు, వైద్య పరీక్షల వ్యయం మాత్రమే కాకుండా చికిత్స కోసం చేసే ప్రయాణం, బస, భోజనాల ఖర్చులు కూడా కుటుంబాలపై తీవ్ర భారం మోపుతున్నాయి.

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజా సర్వే వివరాలు ఈ ఆందోళనకర వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చాయి. తెలంగాణలో ప్రసవ ఖర్చులు మినహాయించి ఒక్కో ఆసుపత్రి చికిత్సకు సగటున రూ.52,743 ఖర్చు అవుతున్నట్లు నివేదిక వెల్లడించింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల ఖర్చులను కలిపి ఈ గణాంకాలు వెల్లడించబడ్డాయి.

వైద్య నిర్ధారణ పరీక్షలు, ప్రత్యేక మందులు, ప్రైవేటు వైద్య సేవలపై ఆధారపడటం వల్ల ఈ వ్యయం మరింత పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు, చిన్న రైతులు, తక్కువ ఆదాయ వర్గాల కుటుంబాలకు ఒక్కసారిగా వచ్చే వైద్య ఖర్చు నెలల తరబడి కూడబెట్టుకున్న పొదుపులను ఖాళీ చేస్తోంది. చాలామంది అప్పుల ఊబిలోకి నెట్టబడుతున్నారు.

అయితే సమస్య అక్కడితో ముగియడం లేదు. చికిత్స కోసం ప్రయాణించాల్సి రావడం కుటుంబాలపై మరో అదనపు భారంగా మారింది. దేశవ్యాప్తంగా వైద్య ప్రయోజనాల కోసం జరిగే ఒక్కో రాత్రి బస ప్రయాణానికి సగటున రూ.32,167 ఖర్చవుతున్నట్లు ఎన్ఎస్ఓ గణాంకాలు వెల్లడించాయి. గ్రామీణ కుటుంబాలు సగటున రూ.29,454, పట్టణ కుటుంబాలు రూ.41,649 వరకు ఖర్చు చేస్తున్నాయి.

తెలంగాణలో అధునాతన వైద్య సేవలు ఎక్కువగా హైదరాబాద్‌లో కేంద్రీకృతమై ఉండటంతో ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల ప్రజలు పెద్దఎత్తున రాజధానికి రావాల్సి వస్తోంది. ప్రయాణ ఖర్చులు, అద్దె గదులు, రోగి సహాయకుల భోజన వ్యయం వంటి అదనపు ఖర్చులు కుటుంబాల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. కొంతమంది ఆసుపత్రి కారిడార్లలోనే రాత్రులు గడపాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

ఎన్ఎస్ఓ గణాంకాల ప్రకారం ఆరోగ్య సంబంధిత ప్రయాణాలు దేశంలోని మొత్తం రాత్రి బస ప్రయాణాల్లో దాదాపు 29.6 శాతం వాటా కలిగి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణ వాసుల కంటే రెండింతలు ఎక్కువగా వైద్య ప్రయాణాలు చేస్తున్నట్లు అధ్యయనం వెల్లడించింది.

ఆరోగ్య సేవల విస్తరణలో తెలంగాణ దేశంలో ముందంజలో ఉన్నప్పటికీ, సాధారణ కుటుంబాలకు వైద్యం అందుబాటులో ఉండేలా జిల్లాల స్థాయిలో సూపర్ స్పెషాలిటీ సేవలను విస్తరించడం కాలానుగుణ అవసరంగా మారింది. లేకపోతే అనారోగ్యం కంటే దాని ఖర్చే కుటుంబాలను మరింతగా కుంగదీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అనారోగ్యం నుంచి కోలుకోవడం ఒక సవాలైతే, ఆర్థికంగా నిలదొక్కుకోవడం మరో పెద్ద పోరాటంగా మారుతోంది. ఇది తెలంగాణ ఆరోగ్య రంగం ముందు నిలిచిన నూతన సామాజిక సవాలు.

వైద్య ఖర్చులను తగ్గించడానికి ప్రభుత్వం, సమాజం, వ్యక్తులు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లా స్థాయిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, క్యాన్సర్ మరియు నరాల వైద్య కేంద్రాల సంఖ్య పెంచడం ద్వారా హైదరాబాద్‌కు జరిగే ఖరీదైన వైద్య ప్రయాణాలను తగ్గించవచ్చు. ఆరోగ్యశ్రీ వంటి పథకాల పరిధిని విస్తరించి మందులు, నిర్ధారణ పరీక్షలు, ప్రయాణం మరియు సహాయకుల బస ఖర్చులను కూడా అందులో చేర్చాలి. టెలిమెడిసిన్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా అనవసర ప్రయాణాలను నివారించవచ్చు. అదే సమయంలో మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించే ఉచిత స్క్రీనింగ్ కార్యక్రమాలను బలోపేతం చేయాలి. ప్రజలు ఆరోగ్య బీమా తీసుకోవడం, నివారణాత్మక ఆరోగ్యంపై దృష్టి పెట్టడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా భారీ వైద్య ఖర్చుల నుంచి కొంతవరకు రక్షణ పొందవచ్చు. వైద్య సేవలు ప్రజలకు చేరువ కావడం, ఆరోగ్య బీమా విస్తరించడం, నివారణాత్మక వైద్యాన్ని ప్రోత్సహించడం అనే మూడు చర్యలే కుటుంబాలపై పెరుగుతున్న ఆరోగ్య భారం తగ్గించడానికి దీర్ఘకాలిక పరిష్కారాలుగా నిలుస్తాయి.

# నోటిని అదుపులో పెట్టుకోవాలి
# పార్టీ నేతలకు కొండా సురేఖ హెచ్చరిక



వరంగల్ సెప్టెంబర్ 29:వర్గ విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం పని చేయాలని, కొంతమంది నేతలు నోరు హద్దులో పెట్టుకోవాలని కొండా సురేఖ హితవు పలికారు. కొంతమంది నాయకులు హద్దు మీరి మాట్లాడుతున్నారని, నోరు అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తానని హెచ్చరించారు. ఒక్కో మహిళ నలుగురిని కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా కొండా దంపతులను విమర్శించాలంటే నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కొండ అభిమానులను, కాంగ్రెస్ కార్యకర్తలను విమర్శించే వారు ఇకపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతిపక్ష నేతలు నాయకులు గాలిలో కత్తులు తిప్పుతున్నారని మండిపడ్డారు. వారిని ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలని సూచించారు.

# అధికారంలో లేకున్నా తగ్గని జోరు..
# బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

హైదరాబాద్, సెప్గెంబర్ 29 తెలంగాణలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ.16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) పార్టీకి రూ.15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరగడం గమనార్హం.సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.రాష్ట్రంలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్, తిరిగి గద్దెనెక్కాలని బీఆర్ఎస్, తొలిసారి పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో బీఆర్ఎస్‌కు నిధులు పెరగడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా మారింది.

టీడీపీకి అత్యధికంగా ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి విరాళం

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ)లకు అందిన విరాళాలు గత ఆర్థిక సంవత్సరంలో తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా అధికారంలోకి వచ్చినప్పటికీ టీడీపీకి విరాళాలు తగ్గగా, ప్రతిపక్ష హోదాలో ఉన్న వైసీపీకి అందిన విరాళాల్లో భారీ పతనం నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, రూ. 20 వేలకు మించి స్వీకరించిన విరాళాల వివరాలను ఆయా పార్టీలు భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నివేదించాయి.ఈ నివేదికల ప్రకారం, 2025-26లో వైసీపీకి కేవలం రూ. 24.31 కోట్ల విరాళాలు మాత్రమే అందాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఈ మొత్తం రూ. 140.04 కోట్లుగా ఉండటం గమనార్హం. అంటే, వైసీపీకి అందిన విరాళాలు సుమారు 82 శాతం మేర క్షీణించాయి. మరోవైపు, అధికార టీడీపీకి రూ. 58.25 కోట్ల విరాళాలు రాగా, అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ. 83.03 కోట్లుగా ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి అందిన విరాళాలు కూడా దాదాపు 30 శాతం మేర తగ్గుముఖం పట్టాయి

# రాహుల్ గాంధీని దేశ ప్రజలు తూ.. అనిఅసహ్యించుకుంటున్నారు.

**రాహుల్ గాంధీ కాదు ఆయన జేజమ్మ దిగి వచ్చిన మోడీ గారిని ఢీకొట్ట లేరు**

**మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్**

న్యూ డిల్లి సెప్టెంబర్ 29:రాహుల్ గాంధీని దేశ ప్రజలు తూ.. అనిఅసహ్యించుకుంటున్నారు.రాహుల్ గాంధీ కాదు ఆయన జేజమ్మ దిగి వచ్చిన మోడీ గారిని ఢీకొట్ట లేరని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

మంగళవారం

ఎంపీ ధర్మపురి అరవింద్, బిజెఎల్పి నాయకుడు మహేశ్వర్ రెడ్డి,రితేష్ రాథోడ్ తో కలిసి డిల్లీ తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశం లో ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారు.



కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల సమస్యలను ప్రస్తావించి ప్రతిపక్ష పాత్ర పోషించడంలో పూర్తిగా విఫలమైంది. అసహనంతో అనేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

రాహుల్ గాంధీ ప్రపంచమంతా తిరుగుతూ భారతజాతి ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థని అపహాస్యం చేసి దిగజారేలా వ్యవహరిస్తున్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రజలు తూ.. అని అసహ్యించుకుంటున్నారు. అయినా ఆయనలో ఎలాంటి మార్పు రావడం లేదు.

సరిగ్గా రెండేళ్ల క్రితం ఓటర్ జాబితాను సరిచేయాలని డిమాండ్ చేసిందే రాహుల్ గాంధీ.

స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ అనేది కొత్తది కాదు, నిరంతర ప్రక్రియ.

స్వతంత్రం వచ్చిన తర్వాత పది సార్లు స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ జరిగింది.

చివరి సారిగా 2021లో జరిగింది.

దేశంలో అనేక కమిటీలు ఎన్నికల సంస్కరణల కోసం వేయబడ్డాయి.

1975లో జస్టిస్ తర్కొండే కమిటీ,

1980 లో పార్లమెంటు స్టాండింగ్ కమిటీ,

1990లో దినేష్ గోస్వామి కమిటీ,

జస్టిస్ జీవన్ రెడ్డి కమిటీలు అనేక సిఫార్సులు చేశాయి.

1952 మొదటి ఎలక్షన్ నుంచి ఇప్పటివరకు అనేక ఎన్నికల సంస్కరణలు వచ్చాయి.. అందులో భాగమే ఈవీఎంలు కూడా.

వజఎ లను మొట్టమొదటిగా తీసుకువచ్చింది రాజీవ్ గాంధీ అని ఒకపక్క గొప్పగా చెప్తారు.. మరోపక్క వజఎ మీద ఆరోపణలు చేస్తారు.

2017 లో వివి పాడ్ తీసుకు వచ్చింది నరేంద్ర మోదీ గారు.

గెలిస్తే ఒక పాట ఓడిపోతే మరొక పాట పాడటం కాంగ్రెస్ అలవాటు.

సర్ ప్రక్రియ తర్వాత తమిళనాడులో విజయ్ గెలిచారు. కేరళలో గెలిచింది కాంగ్రెస్ పార్టీ. 2024 పార్లమెంటు ఎన్నికల్లో మేము అబ్ కీ బార్ చార్ సౌ పార్ అని ఓట్లకి వెళ్ళాము.. నిజంగానే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయగలిగితే 400 సీట్లు తెచ్చుకొనే వాళ్ళం కదా ? బీజేపీ 240 సీట్లు మాత్రమే వచ్చాయి. అప్పుడు బీజేపీ పని అయిపోయింది అన్నారు. కానీ 2026లో.. ఏ సర్వే చూసినా మోదీ గారిని దేశంలో ఎవరూ ఢీకొట్టే పరిస్థితి లేదు. రాహుల్ గాంధీ కాదు ఆయన జేజమ్మ దిగి వచ్చిన మోడీ గారిని ఢీకొట్ట లేరు అనే భావన వచ్చింది.

మోదీ గారు వచ్చిన తర్వాతనే ప్రపంచ చిత్రపటం మీద భారత జాతీయ పతాక రెపరెపలాడుతుంది. రెండు లక్షల కోట్లు మాత్రమే క్యాపిటల్ ఎక్స్పెండిచర్ ఉన్న దేశంలో 12 లక్షల కోట్ల రూపాయల క్యాపిటల్ ఎక్స్పెండిచర్ ఖర్చు చేయగలుగుతున్నాము

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు..

ఎస్ ఐ ఆర్ ద్వారా చనిపోయిన వారి ఓట్లను తొలగించడం తప్పా?

షిఫ్టింగ్ ఆఫ్ ఓట్లను చేయడం తప్పా ?

ఎన్నికల్లో ఊర్లలో 90 నుంచి 92% ఓట్లు పోలవుతాయి. కానీ పట్టణాల్లో ఎందుకు జరగడం లేదు అంటే వాళ్ళకి రెండు చోట్ల ఓట్లు ఉండడం కూడా ఒక కారణం.

మొన్న జరిగిన ఎన్నికల్లో మల్కాజ్గిరి పార్లమెంటులో పోలైన ఓట్లు 52 శాతం.

ఎక్కువ శాతం కాకపోవడానికి కారణం ఊర్లలో ఓటు ఉంటది, పట్టణంలో ఓటు ఉంటది, ఏపీలో ఓటు ఉంటుంది.. హైదరాబాదులో ఉంటుంది. గుజరాత్ లో ఉంటుంది మల్కాజిగిరిలో ఉంటుంది.

చనిపోయిన వారు, షిఫ్ట్ అయిన వారు, రెండు దిక్కుల ఓట్లు ఉన్న వారిని మార్చి ఒక మనిషికి ఒకే దగ్గర ఓటు ఉండాలి అనే నిబంధన తీసుకురావడం తప్పా ? అని ప్రశ్నించారు.

చరిత్రలో ఎలక్షన్ కమిషన్ ను అత్యధికంగా మిస్ యూస్ చేసిన పార్టీ కాంగ్రెస్.

1975లో ఎమర్జెన్సీ పెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది కాంగ్రెస్ పార్టీ.

హెరాల్డ్ కేసులో సోనియాగాంధీని కాపాడిన ఎమ్మెస్ గిల్ కి కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది మీరు. దొంగలు మీరు. అనేక తప్పులు చేసింది మీరు. తప్పులను సరి చేస్తుంటే అక్కసుతో మాట్లాడుతున్నారు.

బిజెపి ప్రజాస్వామ్యాన్ని, దేశ ప్రజలను, కష్టాన్ని నమ్ముకుంది.. దేశాన్ని అభివృద్ధి చేస్తుంది. దేశం ఫస్ట్.. తర్వాతనే పార్టీ.. ఆ తర్వాతనే వ్యక్తి, ఇదే మా సిద్ధాంతం. మావి పవర్ ఓరియెంటెడ్ పాలిటిక్స్ కావు పీపుల్ ఓరియెంటెడ్ పాలిటిక్స్.

కాంగ్రెస్ చేస్తున్న పిచ్చి పనులకు ప్రజలే కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరిస్తూ.. చౌకబారు ప్రయత్నాలు మానుకొని.. ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలను ప్రస్తావించి ప్రతిపక్ష పార్టీగా పేరు తెచ్చుకోవాలని సూచిస్తున్నాను.

ఓటు చోరీ పేరుతో బీహార్లో ఎన్నికలకు పోతే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు కూడా తుడిచి పెట్టుకొని పోయాయి.

ఇదే నినాదంతో దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తే దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకొని పోతుంది.

కాంగ్రెస్ ముక్త భారత్ అనేది మా మోడీ కల.. కానీ దానిని రాహుల్ గాంధీ నిజం చేయబోతున్నారన్నారు.

# సొహ్రాబుద్దీన్ కేసులో 22 మంది నిర్దోషిత్వంపై సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో 22 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ కింది కోర్టులు ఇచ్చిన తీర్పును పరిశీలించేందుకు అంగీకరించింది. విచారణ సమయంలో 92 మంది ప్రాసిక్యూషన్ సాక్షులు ప్లేట్ ఫిరాయించడంపై ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, ఈ కేసులో గతంలోనే డిశ్చార్జ్ అయిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా విషయంలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది.సుప్రీంకోర్టు నిర్ణయాన్ని సీపీఐ సీనియర్ నేత నారాయణ స్వాగతించారు. సొహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసర్ బీ, సహచరుడు తులసీరామ్ ప్రజాపతి వరుస హత్యలపై సమగ్ర న్యాయ సమీక్ష జరగాలని డిమాండ్ చేశారు. ఈ కేసును విచారిస్తున్న జడ్జి బి.హెచ్. లోయా మరణంపై అప్పట్లో పెద్ద వివాదం అయిందని చెప్పారు. అప్పట్లో గుజరాత్ హోంమంత్రిగా ఉన్న అమిత్ షా ఈ కేసులో నిందితుడిగా ఉండి, ఆ తర్వాత డిశ్చార్జ్ అయిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కేసును విచారించే న్యాయమూర్తులకు ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించాలని, తద్వారా వారు ఎలాంటి భయాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా విధులను నిర్వర్తించగలరని అభిప్రాయపడ్డారు

# గొర్రెలను ఢీ కొన్న రైలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రైలు ఢీకొని సుమారు వందకు పైగా గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. అషాపూర్ సమీపంలోని కేఫాల్ వద్ద మంగళవారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. కాజీపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలపై నిద్రిస్తున్న గొర్రెల మందపై నుంచి వెళ్లడంతో ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు.ప్రమాద జరిగిన సమయంలో గొర్రెల కాపర్లు రైల్వే ట్రాక్‌కు కొద్దిదూరంలో నిద్రిస్తుండటంతో ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున రైలు వచ్చే సమయంలో శబ్దానికి గొర్రెలు భయాందోళనకు గురై ట్రాక్‌పైకి పరుగులు తీయడంతో ఎక్కువ గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ క్రమంలో వేగంగా వస్తున్న దక్షిణ ఎక్స్‌ప్రెస్ గొర్రెలను ఢీకొట్టడంతో అవి చనిపోయాయి.సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. ప్రమాద తీవ్రతకు గొర్రెలు శరీరావయవాలు ఛిద్రమై ట్రాక్‌పై పడిపోవడంతో ఆ ప్రాంతమంతా అత్యంత విషాదకరంగా మారింది. జీవనాధారమైన గొర్రెలు మృత్యువాత పడటంతో గొర్రెల కాపర్లు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అధికారులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

# ఆపదలో ఆపద్బాంధవుడు.. గాయపడిన యువకుడికి డాక్టర్ రాజశేఖర్ గౌడ్ చేయూత

**రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్వయంగా కారులో ఆస్పత్రికి తరలించిన డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 29:**విధి నిర్వహణ ముగించుకుని తిరిగి వెళు
_న్న ఖమ్మం డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చూసి మానవత్వంతో స్పందించిన ఘటన ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. కలెక్టరేట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన అభిషేక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.



వాటర్ క్యాన్లతో వెళ్తున్న ఆటో ట్రాలీ ప్రమాదానికి గురికావడంతో అభిషేక్ రోడ్డుపై తీవ్ర గాయాలతో పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అక్కడ గుమిగూడారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో విధులు ముగించుకుని తిరిగి వెళ్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ అక్కడి పరిస్థితిని గమనించారు.



వెంటనే తన వాహనాన్ని ఆపి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

అప్పటికే అటువైపు నుంచి 108 అంబులెన్స్ వెళ్లినప్పటికీ ప్రమాద బాధితుడిని తరలించకపోవడంతో, పరిస్థితిని గమనించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా గాయపడిన అభిషేక్‌ను తన కారులో ఎక్కించుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రికి చేరుకున్న అనంతరం బాధితుడి పరిస్థితిని స్వయంగా పరిశీలించగా ఈ ప్రమాదంలో అభిషేక్ కుడి తొడ భాగం విరిగినట్లుగా గుర్తించి అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుని, బాధితుడి పరిస్థితిని పర్యవేక్షించారు.

ఒక జిల్లా స్థాయి వైద్యాధికారిగా తన విధులకే పరిమితం కాకుండా, ఆపదలో ఉన్న ఓ అపరిచితుడిని సొంత మనిషిలా భావించి తక్షణమే స్పందించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తీరు పలువురి ప్రశంసలు అందుకుంది.

పరిచయం లేదు.. ప్రాంతం తెలియదు.. అయినా ఆపదలో ఉన్న ప్రాణాన్ని కాపాడాలనే మానవత్వంతో ముందడుగు వేశారు. వైద్యుడిగా తన బాధ్యతను ఆస్పత్రి గోడలకే పరిమితం చేయకుండా, రోడ్డుపైనే ఆచరణలో చూపించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలిచింది.

"వైద్యానికి ఎల్లలు లేవు.. మానవత్వానికి హద్దులు లేవు" అన్న మాటకు డాక్టర్ రాజశేఖర్ గౌడ్ స్పందన ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.

# పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

**సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సకాలంలో నమోదు చేయాలి**

**సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలి**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 29:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ మంగళవారం గుండాల, బోడు, కొమరారం పోలీస్ స్టేషన్లను సందర్శించి తనిఖీ చేశారు. గుండాల పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించి, పోలీస్ స్టేషన్లలో రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు.గుండాల పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన సందర్భంగా కాంపౌండ్ వాల్,





గార్డ్ పోస్ట్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, స్టేషన్ ప్రాపర్టీ భద్రతకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశీలించి, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, ఇతర వివరాలను సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని, పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై ప్రతి పోలీస్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులతో బాధ్యతగా వ్యవహరించి, వారికి న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.అనంతరం పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో సీఐలు తిరుపతి, సత్యనారాయణ, ఎస్ఐలు, శ్రవణ్ కుమార్, రాజమౌళి, నాగుల్ మీరా, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు గర్వకారణం !




**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 29 సెప్టెంబర్ 2026** ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీకాళహస్తిలో 72 వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2026 - 27 సెప్టెంబర్ నెల 24 నుండి 28 వరకు జరిగిన నేపథ్యంలో మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని క్రీడాకారిణి భావన మిగతా తెలంగాణ రాష్ట్ర మహిళల జట్టు సభ్యులు రాధిక, అంజలి, ధనలక్ష్మి, దేవికల సమన్వయంతో ఆట ప్రతిభ, కృషివలన కేరళ బాల్ బ్యాడ్మింటన్ టీంపై శుక్రవారం రోజున 35-32, 36-34 పాయింట్లతో గెలుపొందగా శనివారం రోజున 35-22, 35-29 చతీస్ఘడుపై విజయం సాధించిగా, ఆదివారం రోజున మహారాష్ట్రతో పోటీలో 35-24, 30-35, 35-33 పాయింట్ లతో గెలుపొందడం దరిమిలా సేమి ఫైనల్ చేరుకొని సోమవారం రోజున కర్ణాటకతో తలపడీ పోటీల్లో ఒడిపోవడం జరిగింది. మొదటి నుండి





తెలంగాణ రాష్ట్ర మహిళల జట్టు తరుపున అద్భుత ప్రదర్శన కనబరిచి నందుకు గాను మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారిణి భావన ప్రతిష్టాత్మకమైన స్టార్ ఆఫ్ ఇండియా ప్రత్యేక అవార్డు సాధించి నందుకు అసోసియేషన్ చీఫ్ పాట్రన్ నవీన్ కుమార్,



సలహాదారు అందె లక్ష్మణ రావు, ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస రావు, సభ్యులు హరినాథ్ రెడ్డి, సాయిరామ్, వినయ్, శాస్త్రి, రాంరెడ్డి, టి.శ్రీనివాస రావు హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన విజయం సాధించినందుకు మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ భావనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె క్రీడా జీవితంలో నిరంతర విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తో దీవెనలు తెలియజేశారు. ఈ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళల జట్టు 4వ స్థానం సాధించడం కూడా గర్వ కారణం. క్రీడాకారిణిల ప్రతిభకు విలువైన మద్దతు, ప్రోత్సాహం మరియు గుర్తింపు అందించి నందుకు తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియ జేస్తున్నాము.

## పట్లూర్ అండర్ డ్రైనేజ్ ప్రారంభోత్సవశీలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, పూజ చేస్తున్న గ్రామ సర్పంచ్ పరశురాం






**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో అండర్ డ్రైనేజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులు మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ పాల్గొన్నారు, ప్రారంభోత్సవంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పరుశురాం ,పట్లూరు గ్రామంలో ఒక్కొక్కటి గా అన్ని కార్యక్రమాలు సజావుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారువాటర్ సప్లైవాటర్ గుమ్ములు సీసీ రోడ్లు అక్కడక్కడ అత్యవసరం ఉన్న చోట టు పీస్ మోటార్స్ అమర్చడం ఇలా ప్రజలకు కావలసిన అత్యవసర వసతులు ఎప్పటికప్పుడు సమకూర్చడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పరుశురాంతెలిపారు గ్రామానికి కావలసిన నిధుల విషయంలో ఎప్పటిక ప్పుడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులకు వివరిస్తూ వారితో కలిసి ప్రియతమ నాయకులు వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆశీర్వాదంతో గ్రామాన్ని ఒక్కొక్కటిగా అన్ని కార్యక్రమాలు నిరంతరం అయ్యేలా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు ఇందిరమ్మ ఇల్లు నూతనంగా వచ్చినటువంటి వారికి స్వయ ంగా విగ్రహాన్ని దర్శించి వారికి త్వరితముగా పనులు ప్రారంభించాలని మర్పల్లి ఎంపీడీవో, ఎం పి ఓ శ్రీనివాస్, విద్యాధికారి బి అశోక్ లబ్ధిదారుల గృహాలను సందర్శించి వెరిఫికేషన్ చేయడం జరిగిందని తెలిపారు అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు ఉచిత కరెంటు ఉచిత బస్సు సౌకర్యం ఎలా ఒక్కొక్కటిగా అన్ని కార్యక్రమాలు నిరంత రం సజా వుగా ప్రజలకు అందించేలా కృషి చేస్తామని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్ తెలిపారు, కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరుశురాం, ఉప సర్పంచ్ అఖిల్, వార్డ్ మెంబర్స్, మాజీ ఎంపిటిసి రాజు, మహేష్, యువ నాయకుడుగోవర్ధన్,కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ చాట్ల రాకేష్,మరియు గ్రామ పెద్దలు యువకులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు

# నూతనంగా ఎన్నికైన టీ వై జె ఎఫ్ సంగారెడ్డి జిల్లా సెక్రెటరీగా బి, రాజు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** టీ వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ జితేందర్ రావు తనుగుల, ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, చేతుల మీదుగా నూతనంగా సంగారెడ్డి జిల్లా సెక్రెటరీగా ఎన్నికైన బి,రాజుకు, ఈరోజు మంగళవారం అపాయింట్మెంట్ లెటర్, ఐడి కార్డు, బి,రాజుకు, అందజేశారు, ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ బాగయ్య జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తలారి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, షేక్ మహబూబ్, టీ వై జె ఎఫ్ యూనియన్ కు ఎంతో కృషి చేస్తూ, అన్ని నియోజకవర్గాల్లో కమిటీలు వేస్తూ, వారికి ఐడి కార్డులు సర్టిఫికెట్లు మెమెంటోళ్లు అందజేసి, జిల్లాలో ఉన్న జర్నలిస్టులందరినీ ఒక్క తాటి పైకి తేవాలనె ఉద్దేశంతో ఎంతో శ్రమకు ఓర్చి ఇప్పటికే టీ వై జె ఎఫ్ యూనియన్ లోకి ఎంతోమందిని జర్నలిస్టులను ఆహ్వానించి, వారందరికీ ఐడి కార్డులు హెల్త్ కార్డులు అందజేశారు, టీ వై జె ఎఫ్ యూనియన్ లోకి ఇంకా ఎక్కువ మంది రిపోర్టర్లను, చేర్చుకోవాలని ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు, ఆయన కృషికి విలేకరుల అందరి తరపున షేక్ మహబూబ్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు....

# సింగరేణి నుండి సత్తుపల్లి అభివృద్ధికి రూ.5 కోట్లు

## నియోజకవర్గ సమస్యలపై హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం.. నిధుల విడుదలకు ప్రభుత్వం సానుకూల స్పందన.



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 29:** సింగరేణి సంస్థ పరిధిలోని నియోజకవర్గాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారంపై హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో సింగరేణి పరిధిలోని ఎమ్మెల్యేలు, జెన్‌కో, ట్రాన్స్‌కో, సింగరేణి సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించిన సింగరేణి సమస్యలు, మౌలిక వసతులు, అభివృద్ధి అవసరాలను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన పలు అభివృద్ధి పనులను వివరించి, వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి పనులకు రూ.5 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో నియోజకవర్గంలో అవసరమైన మౌలిక వసతులు, ప్రజా అవసరాలకు సంబంధించిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విడుదలైన నిధులను ప్రజలకు అత్యవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమంలో వినియోగించి, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, జెన్‌కో, ట్రాన్స్‌కో, సింగరేణి సంస్థల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' అమలు




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :**నవంబర్ 19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' అమలుతెలంగాణలో యువతకు శుభవార్త. రాజీవ్ యువ వికాసం పథకం నవంబర్ 19 నుంచి ప్రారంభం కానుంది. అర్హులైన బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు రూ. లక్ష చొప్పున నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రకటించారు,దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి,లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.....

# తిరుమలకు భారీగా ఆదాయం

తిరుమల, సెప్గెంబర్ 29 కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి వారి హుండీకి భక్తులు భారీగా కానుకలు సమర్పించారు. తిరుమలలో నిన్న (ఆదివారం) ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.07 కోట్లుగా నమోదైనట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. వారాంతపు సెలవు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఈ స్థాయిలో ఆదాయం సమకూరింది.టీటీడీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 27వ తేదీన మొత్తం 83,578 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 31,137 మంది భక్తులు మొక్కులు చెల్లించుకుని తలనీలాలు సమర్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా రికార్డు స్థాయిలో 4.39 లక్షల లడ్డూలను విక్రయించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, దాదాపు 2.88 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,631 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది.భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల శిలాతోరణం వరకు విస్తరించాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తిరుమలకు యాత్ర ప్రణాళిక చేసుకునేవారు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

# భారత ముస్లిం సమాజ అభివృద్ధికి విద్య ఒక్కటే మార్గం

జ్ఞానాన్ని, విద్యను తమ మార్గదర్శక సూత్రాలుగా చేసుకున్న సమాజాలే పురోగతిని, స్థిరత్వాన్ని, గౌరవప్రదమైన స్థానాన్ని సాధించాయనే వాస్తవానికి మానవ చరిత్ర సాక్ష్యమిస్తుంది. జ్ఞానం, పరిశోధన, సాంకేతిక రంగాలలో ప్రపంచ సమాజం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో, భారతీయ ముస్లిం సమాజం వెనుకబాటుతనం, అజ్ఞానం, ఆర్థిక బలహీనతలను అధిగమించి పురోగతి, శ్రేయస్సు వైపు పయనించడానికి విద్య ఒక్కటే ఏకైక మార్గం.ఇస్లాం ఆరంభం నుంచే జ్ఞాన ప్రాముఖ్యతకు గొప్ప ప్రాధాన్యతనిచ్చిన మతం. పవిత్ర ఖురాన్ యొక్క మొదటి అవతరణ 'ఇఖ్రా' (చదవండి) అనే పదంతో ప్రారంభమవుతుంది, ఇది ఇస్లాంలో జ్ఞానం యొక్క ప్రాథమిక ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేస్తుంది. ఖురాన్ ఇలా ప్రశ్నిస్తుంది: "తెలిసిన వారు, తెలియని వారితో సమానమా?" ఈ వాక్యం జ్ఞానం యొక్క శ్రేష్ఠతను మరియు ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేస్తుంది. అదేవిధంగా, ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు: "ప్రతి ముస్లిం పురుషుడు మరియు స్త్రీపై జ్ఞానాన్ని సంపాదించడం విధి." ఈ హదీస్ ఇస్లాంలో విద్య పురుషులకు మాత్రమే పరిమితం కాదని, అది మహిళలకు కూడా అంతే అవసరమని స్పష్టం చేస్తుంది.ఇస్లామిక్ చరిత్ర మనకు ఎందరో పండితులు, మేధావులు మరియు శాస్త్రవేత్తలను అందిస్తుంది. వీరు తమ జ్ఞానాన్వేషణ ద్వారా కేవలం ముస్లిం సమాజానికే కాకుండా యావత్ మానవాళికి అద్భుతమైన సేవలు అందించారు. ఇమామ్ అల్-గజాలీ తత్వశాస్త్రం, ఇస్లామిక్ న్యాయశాస్త్రం

మరియు ఆధ్యాత్మికతకు విలువైన సేవలు అందించారు మరియు ముస్లింలకు మేధోపరమైన మార్గదర్శకత్వం ఇచ్చారు. ఇబ్న్ సినా వైద్య రంగంలో గణనీయమైన కృషి చేశారు, మరియు ఆయన రచనలు శతాబ్దాల పాటు ఐరోపాకు ప్రయోజనం చేకూర్చాయి. అల్-ఖ్వారిజ్మీ బీజగణితానికి పునాదులు వేశారు, ఇది ఆధునిక గణితశాస్త్రంలో ఒక ముఖ్యమైన శాఖగా నిలిచి ఉంది. ఇబ్న్ ఖల్దూన్‌ను సామాజిక శాస్త్ర మార్గదర్శకులలో ఒకరిగా పరిగణిస్తారు, ఎందుకంటే ఆయన సమాజం, సామాజిక వ్యవస్థలు మరియు చరిత్రను అర్థం చేసుకోవడానికి కొత్త మార్గాలను పరిచయం చేశారు.ముస్లింలు జ్ఞాన రంగంలో పురోగమించినప్పుడు, వారు తమ సమాజానికే కాకుండా యావత్ మానవాళికి కూడా ప్రయోజనకరంగా మారతారని ఈ మహనీయులు నిరూపించారు. దురదృష్టవశాత్తు, ప్రస్తుత కాలంలో భారతీయ

ముస్లిం సమాజం విద్యా రంగంలో గణనీయంగా వెనుకబడి ఉంది. పేదరికం, విద్యా సౌకర్యాల కొరత, తగినంత అవగాహన లేకపోవడం, మరియు కొన్ని సామాజిక అడ్డంకులతో సహా దీనికి అనేక కారణాలు ఉన్నాయి.విద్యా లోపం ముస్లిం సమాజాన్ని ఆర్థికంగానే కాకుండా సామాజికంగా, రాజకీయంగా కూడా బలహీనపరిచింది. ఒక సమాజం పురోగమించాలంటే, అది ముందుగా తన విద్యా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి. ఆధునిక విద్యతో పాటు, మత విద్యపై సమతుల్య అవగాహన కూడా అవసరం. తద్వారా సంపూర్ణ, బాధ్యతాయుతమైన, విజ్ఞానవంతమైన తరాన్ని అభివృద్ధి చేయవచ్చు.మన కాలపు అత్యవసరమైన బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. విద్యావంతురాలైన మహిళ తనను తాను చైతన్యవంతం చేసుకుని, శక్తిమంతురాల వడమే కాకుండా, విద్యావంతులైన

కుటుంబానికి, ప్రగతిశీల సమాజానికి పునాది వేస్తుంది. ఇస్లాం మహిళలకు జ్ఞానాన్ని సంపాదించే హక్కును ఇచ్చింది, అందువల్ల ముస్లిం సమాజం తన కుమార్తెల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

ఆధునిక యుగంలో, సాంప్రదాయ విద్య ఒక్కటే సరిపోదు. ముస్లింలు ఆధునిక విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, వైద్యం, ఇంజనీరింగ్, సమాచార సాంకేతికత మరియు ఇతర వృత్తిపరమైన రంగాలలో కూడా పురోగతి సాధించాలి. ఈ లక్ష్యం కోసం, విద్యా సంస్థలను బలోపేతం చేయాలి, స్కాలర్‌షిప్ అవకాశాలను విస్తరించాలి మరియు యువతలో విద్య యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి.

అదే సమయంలో, ముస్లిం నాయకత్వం, సామాజిక సంస్థలు మరియు మేధావులు తమ బాధ్యతను గుర్తించి, విద్యను ప్రోత్సహించడానికి ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు

మతపరమైన మరియు సమకాలీన విద్య రెండింటి నుండి ప్రయోజనం పొందగలిగేలా మదర్సాలకు, ఆధునిక విద్యా సంస్థలకు మధ్య మరింత సమన్వయం పెంపొందించాలి. ఇటువంటి విధానం, తమ విలువలకు కట్టుబడి ఉంటూనే, ఆధునిక ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధులైన తరాన్ని సృష్టించడానికి సహాయపడుతుంది.

అంతిమంగా, భారతీయ ముస్లిం సమాజాన్ని చీకటి నుండి వెలుగు వైపుకు నడిపించగల శక్తి విద్యే. మనం నిజంగా పురోగతిని కోరుకుంటే, విద్య మన అత్యున్నత ప్రాధాన్యతగా మారాలి. జ్ఞానం లేకుండా, మనం మన గుర్తింపును ఆత్మవిశ్వాసంతో కాపాడుకోలేము, అలాగే వేగంగా మారుతున్న ప్రపంచంలో విజయవంతంగా పోటీపడలేము. అందువల్ల, ప్రతి ముస్లిం, స్త్రీ పురుష భేదం లేకుండా, విద్యా రంగంలో పురోగతి సాధించడం, తమ పిల్లలకు

నాణ్యమైన విద్య అందేలా చూడటం, మరియు చైతన్యవంతమైన, బలమైన, సంపన్నమైన, మరియు ప్రగతిశీల సమాజ నిర్మాణానికి దోహదపడటం ఈ తరుణంలో అత్యంత అవసరం. భారతీయ ముస్లిం సమాజాన్ని గౌరవం, సాధికారత, మరియు శాశ్వత విజయం వైపు నడిపించగల మార్గం విద్యే.

# అర్హులందరికీ ఆహార భద్రత చట్టం ప్రయోజనాలు అందాలి

## క్షేత్రస్థాయిలో పథకాల అమలును పరిశీలించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 29, 2026 -- ఆదిలాబాద్ ఆహార భద్రత చట్టం--2013 అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. పర్యటనలో భాగంగా గుడిహత్నూర్, సీతాగొంది, పొన్నారి, కోడద్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

గుడిహత్నూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం, జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన చైర్మన్ చిన్నారులు, విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, ఇతర సేవలపై వివరాలు తెలుసుకున్నారు. సీతాగొంది అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందుతున్న పౌష్టికాహారం, కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు.

పొన్నారి, కోడద్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలను తనిఖీ చేసి సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, లబ్ధిదారులకు అందుతున్న సేవలను పరిశీలించారు. స్థానిక సర్పంచ్‌లు, ప్రజలతో మాట్లాడి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఆహార భద్రత చట్టం--2013 ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆహార భద్రత పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడటమే కమిషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రేషన్ సరుకులు, అంగన్‌వాడీ పౌష్టికాహారం, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఆహార భద్రత పథకాల అమలులో ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు లేదా లోపాలు ఉంటే ఫుడ్ కమిషన్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. బుధవారం ఉదయం నిర్వహించే సమీక్ష సమావేశానికి ప్రజలు నేరుగా హాజరై తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు.

పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిని ఫుడ్ కమిషన్ చైర్మన్ సందర్శించారు. ముఖ్యంగా చిన్నారుల వార్డును పరిశీలించి అక్కడ అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను సూచించారు.ఈ పర్యటనలో డీఎస్ఓ నందిని, డీఎం సుధారాణి, డీఆర్డీఓ పీడీ రవీందర్ రాథోడ్, డీఈఓ మాధవి, డీడబ్ల్యూఓ మిల్కాతో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల విద్యాలయాల సమయం,సమస్యలు పరిష్కరించాలి

## టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 29: గురుకుల పాఠశాలల టైం టేబుల్ ను మార్చాలని , గురుకుల విద్యాలయాల సమస్యలను పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉన్న అశాస్త్రీయ టైం టేబుల్ మార్చాలని డిమాండ్ చేశారు. గురుకుల ఉపాధ్యాయులకు 010 హెడ్ ద్వారా వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలు మినహాయించి కేర్ టేకర్లను నియమించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం పరిమితం చేయాలని, హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని, జూనియర్ లెక్చరర్స్ కు గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, అవసరమైన మెటీరియల్ కిట్ అందించాలని



కోరారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించి ప్రశాంత వాతావరణం లో పనిచేసే విధంగా, నాణ్యమైన విద్య బోధించే విధంగా, పాజిటివ్ ఫలితాలు రాబట్టే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. గురుకుల ఉపాధ్యాయులకు డిఏ బకాయిలను చెల్లించాలని, గురుకుల ఉపాధ్యాయులకు పారిటీ స్కేల్స్ ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని కోరారు. అనేక గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తున్నందున సొంత భవనాలు నిర్మించాలని, అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంచంద్, పుల్లయ్య , రాఘవరావు, శంకర్రావు ,నరేష్ ,చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు మాజీ ఎంపీ నామ శ్రీకారం

**కుటుంబ సభ్యుల వివరాలు నమోదుతో గ్రాడ్యుయేట్ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభించిన - మాజీ ఎంపీ నామ**

**గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై నామ ప్రత్యేక దృష్టి - మాజీ ఎంపీ నామ**

**అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు కావాలి - మాజీ ఎంపీ నామ**

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 29:వరంగల్ ఖమ్మం నల్గొండ నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఓటర్ల నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో ముందుగా తన కుటుంబ సభ్యుల గ్రాడ్యుయేట్ వివరాలను నమోదు చేయించారు. నామ సతీమణి చిన్నమ్మ, కుమారులు పృథ్వి తేజ, భవ్య తేజ ల తో పాటు కమ్మ రవి, కమ్మ జ్యోత్స్న, కిలారి ఉదయ్, రమ్యకృష్ణ, నామ సాయిరాం, కావ్య, రవీందర్, ప్రసన్న కుమారి తదితర 15 మంది కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయించారు. అనంతరం పలువురు గ్రాడ్యుయేట్ల వివరాల నమోదుకు శ్రీకారం



చుట్టారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 30 మంది గ్రాడ్యుయేట్ల వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కీలకమైనందున అర్హులైన పట్టభద్రులందరి వివరాలను సేకరించి నమోదు చేయించే దిశగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నామ సూచించారు. ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రాడ్యుయేట్లను సంప్రదించి, నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నేపథ్యంలో నామ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడువు లోపు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, అర్హులైన వారందరి వివరాలను నమోదు చేయించాలని నామ సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా టీం ఈ ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌తో దరఖాస్తు చేయించాలని నామ సూచించారు.

# కళ్యాణిని షఫీనే చంపాడు...

హైదరాబాద్, సెప్టెంబర్ 29 ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో సంచలనం సృష్టించిన కళ్యాణి అలియాస్ దుర్గ (29) దారుణ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. భవానీపురానికి చెందిన షఫి అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు కళ్యాణితో నిందితుడు షఫికి కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలోనే కొన్నాళ్ల క్రితం కళ్యాణి తన కుమారుడిని షఫికి అప్పగించింది. అయితే, తన కుమారుడిని తిరిగి ఇచ్చేయాలని ప్రియుడిపై కళ్యాణి పదే పదే ఒత్తిడి తెచ్చింది.ఈ కుమారుడి విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన షఫి, 10 రోజుల కిందట కళ్యాణిని దారుణంగా హత్య చేశాడని పోలీసులు తెలిపారు. హత్య చేసిన అనంతరం ఆధారాలు లభించకుండా ఉండేందుకు మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి సమీపంలోని కెనాల్‌లో పడేశాడు. లభ్యమైన శరీర భాగాలకు సంబంధించిన ఫోటోలను పోలీసులు ఇన్‌స్టా సహా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మృతురాలి చేతిపై ఉన్న ప్రత్యేకమైన టాటూ ఆధారంగా ఆమె సోదరుడు డెడ్ బాడీ కళ్యాణిదని గుర్తించారు. స్థానిక మీడియా సహకారంతోనే ఈ కేసును వేగంగా ఛేదించామని ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం వెల్లడించారు.

అసలేం జరిగింది..

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం చిన తడినాడకు చెందిన కళ్యాణికి చిన్నప్పుడే తల్లి మరణించింది. తండ్రి తడినాలోనే చిన్న చిన్న పనులు చేస్తుండేవాడు. కళ్యాణికి సోదరుడు ఉన్నాడు. గన్నవరం సమీపంలోని ఓ అనాథాశ్రమంలో తండ్రి వీరిని చేర్చగా అక్కడే పెరిగారు. ఇద్దరు మేజర్లు అయిన అనాథాశ్రమం నుంచి బయటకు వచ్చారు. మంగళగిరిలో ఓ వ్యక్తిని వివాహం చేసుకుని అక్కడే స్థిరపడింది.భర్తతో విభేదాల కారణంగా వేరుగా ఉంటూ మంగళగిరిలోని ఒక హోటల్‌లో సప్లయర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 17న ఆమె అదృశ్యం కాగా, అదే రోజు ఇబ్రహీంపట్నంలోని చన్నీళ్ల కాలువలో ఆమె శరీర భాగాలు ముక్కలుగా నరికిన స్థితిలో కనిపించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పరిసర ప్రాంతాల్లోని 200కు పైగా సీసీటీవీ కెమెరాలను పరిశీలించినప్పటికీ ప్రాథమికంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో మృతురాలి దుస్తులు, చేతిపై ఉన్న ప్రత్యేక టాటూ, కాలి పట్టీల ఫోటోలను పోలీసులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇన్స్టాగ్రామ్‌లో ఈ ఫోటోలను చూసిన ఆమె సోదరుడు గుర్తించి ఇబ్రహీంపట్నం పోలీసులను సంప్రదించడంతో మృతురాలి వివరాలు వెలుగులోకి వచ్చాయి. కళ్యాణిని మంగళగిరిలోనే దారుణంగా హత్య చేసి శరీర భాగాలను కాలువలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

# రక్తదానం చెయ్యండి ప్రాణదాతలు అవ్వండి.

## స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో డీఎంహెచ్ఓ డా.రామారావు పిలుపు.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 29,**ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవాలు మరియు తలసేమియా వంటి వ్యాధులతో పోరాడుతున్న రోగులకు రక్తం ఎంతో అవసరమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడేందుకు ఆరోగ్యవంతులైన యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. రామారావు పిలుపునిచ్చారు.జాతీయ స్వచ్ఛంద రక్తదాన





దినోత్సవం సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ అలాగే ప్రభుత్వ ఎస్సార్ అండ్ బిజీ ఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రత్యేక రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలను డా. రామారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

రక్తదానం -- ప్రాణదానం: రక్తానికి ప్రత్యామ్నాయం మరొకటి లేదని, మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడుతుందని వివరించారు.

అపోహలు వీడండి: 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, 45 కేజీల కంటే ఎక్కువ బరువు ఉన్న ఆరోగ్యవంతులైన స్త్రీ, పురుషులు ఎవరైనా ప్రతి 3-4 నెలలకోసారి నిరభ్యంతరంగా రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యం మెరుగుపడుతుందే తప్ప ఎలాంటి బలహీనత రాదని స్పష్టం చేశారు.

యువతదే కీలక పాత్ర: సమాజంలో రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంలో విద్యార్థులు, యువత ముందుండాలని సూచించారు.

అనంతరం విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి రక్తదాన ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పలువురు విద్యార్థులను, యువకులను అధికారులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేంద్ర, అడిషనల్ డీఎంహెచ్ఓ డా. ఎల్. ప్రవీణ, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. శంకర్, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ ప్రతినిధి శ్రీ నాగయ్య, కళాశాలల అధ్యాపక బృందం, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండు నెలలు పూర్తి చేసుకున్న మధిర 'సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్'

## 11 మండలాల్లోని 27,700 మంది విద్యార్థులకు రోజూ పోషకాహార అల్పాహారం

## సమతుల్య మెనూతో విద్యార్థుల్లో పెరుగుతున్న ఏకాగ్రత, హాజరు శాతం

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 29:**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్కూల్ బ్రేక్‌ఫాస్ట్' ప్రోగ్రామ్‌లో భాగంగా మధిరలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ విజయవంతంగా రెండు నెలల రన్‌ను పూర్తి చేసుకుంది. 2026 జూలై 27న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించిన ఈ బృహత్తర కార్యక్రమం, ఆయన నిరంతర పర్యవేక్షణ,





మార్గదర్శకత్వంలో నిరంతరాయంగా కొనసాగుతోంది.ఈ కేంద్రీకృత వంటశాల ద్వారా మధిరతో పాటు సమీపంలోని 11 మండలాల్లో ఉన్న 575 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 27,700 మంది విద్యార్థులకు రోజువారీగా రుచికరమైన, శుభ్రమైన పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

ఎన్ఐఎన్ ఆధ్వర్యంలో సమతుల్య మెనూ

విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన పోషకాలు అందించేలా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నేతృత్వంలో ప్రత్యేక అల్పాహార పట్టికను రూపొందించారు. వారంలో ప్రతిరోజూ వైవిధ్యమైన ఆహారంతో పాటు రోజు విడిచి రోజు వేడి పాలను అందిస్తున్నారు.

వారపు అల్పాహార మెనూ

ఒకటవ రోజు ఇడ్లీ -- సాంబార్, రెండో రోజు పూరి -- ఆలూ కుర్మా, మూడో రోజు దోశ -- చట్నీ, నాల్గవ రోజు ఉప్మా -- చట్నీ, ఐదో రోజు మిల్లెట్ ఇడ్లీ -- సాంబార్, ఆరో రోజు బోండా -- చట్నీ అందిస్తున్నారు.

అత్యాధునిక వంటశాల -- వేగవంతమైన పంపిణీ

అధిక సంఖ్యలో విద్యార్థులకు నిర్ణీత సమయానికి వేడివేడిగా అల్పాహారం అందించేందుకు ఈ కిచెన్‌లో ఆధునిక యంత్రాలను ఉపయోగిస్తున్నారు. గంటకు 5,400 ఇడ్లీలు, 3,600 పూరీలు, 2,000 దోశలు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన అత్యాధునిక వంటశాల కలిగి,

ఆధునిక పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ తయారు చేసిన అల్పాహారాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరవేస్తున్నారు.

ప్రభుత్వ వ్యయం వివరాలు

విద్యార్థుల స్థాయిని బట్టి ప్రభుత్వం అల్పాహారానికి అయ్యే వ్యయాన్ని భరిస్తోంది.

ప్రాథమిక పాఠశాల (1--5 తరగతులు): రూ. 11.50 (ప్రతి విద్యార్థికి)

ఉన్నత పాఠశాల (6--10 తరగతులు): రూ. 13.50 (ప్రతి విద్యార్థికి)

జూనియర్ కళాశాల: రూ. 13.50 (ప్రతి విద్యార్థికి)

పాలు (రోజు విడిచి రోజు): విద్యార్థికి రూ. 1.08 చొప్పున కేటాయింపు.

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ కృతజ్ఞతలు

ఉదయాన్నే పోషకాహారం అందడం వల్ల విద్యార్థులు ఖాళీ కడుపుతో తరగతుల్లో కూర్చోవాల్సిన అవసరం తప్పిందని, దీనివల్ల వారి ఏకాగ్రతతో పాటు పాఠశాలల్లో హాజరు శాతం మెరుగవుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ వంటశాల నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఆర్థిక సహాయం అందించిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి.

## అదనపు కలెక్టర్ శ్రీజ

## పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌ను పూర్తి చేయాలి

## ఆసుపత్రుల్లో పార్కింగ్, ఇతర ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

## లోపాలున్న డయాగ్నస్టిక్ కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 29:**క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం--2010ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వైద్య సేవలందించే సంస్థలు నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ లో క్లినికల్






ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్--2010 క్రింద జిల్లా స్థాయి అప్రోప్రియట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలు, రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, తనిఖీలు, ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ కేంద్రాల స్థితిగతులపై కమిటీ సమీక్షించింది.

పెండింగ్ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ పూర్తి చేయాలి :

జిల్లాలో పర్మినెంట్ రిజిస్ట్రేషన్, పర్మినెంట్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను వచ్చే నెలలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియలో నిబంధనలు, కనీస ప్రమాణాలు, అవసరమైన అనుమతులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

పార్కింగ్ విషయంలో ఆసుపత్రుల వర్గీకరణ :

ఆసుపత్రులకు అనుమతులు ఇచ్చే సమయంలో పార్కింగ్ సౌకర్యాన్ని పరిశీలించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో పార్కింగ్ సదుపాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. అదే సమయంలో 10 పడకల లోపు ఉన్న నర్సింగ్ హోమ్‌ల విషయంలో పార్కింగ్ అంశాన్ని అనవసరంగా ప్రతిబంధకంగా మార్చకుండా, నిబంధనలకు అనుగుణంగా వాటిని వర్గీకరించి, అర్హత ఉన్న సంస్థలకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.

లోపాలున్న డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు :

జిల్లాలో ఇప్పటికే 16 డయాగ్నస్టిక్ కేంద్రాలను తనిఖీ చేయగా, పలు లోపాలు గుర్తించినట్లు అధికారులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసి, గుర్తించిన లోపాలను నిర్దేశిత గడువులోగా సరిదిద్దుకునేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. లోపాలను సరిదిద్దని సంస్థలకు రిజిస్ట్రేషన్ ఇవ్వకూడదని, గడువు అనంతరం కూడా నిబంధనలు పాటించని సంస్థలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం సంస్థలను సీజ్ చేసి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమీక్ష :

2026 జూలై 27 నుంచి ఇప్పటి వరకు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 29 దరఖాస్తులు అందగా, 20 ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు, 9 దరఖాస్తులు ప్రక్రియలో ఉన్నట్లు సమావేశంలో తెలిపారు. పర్మినెంట్/రెన్యువల్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 52 దరఖాస్తులు అందగా, 16 దరఖాస్తులు ప్రక్రియలో ఉన్నట్లు, 24 దరఖాస్తులను ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు వివరించారు. ట్రాఫిక్ అంశం కారణంగా 3 దరఖాస్తులకు సిఫార్సు చేయలేదని అధికారులు తెలిపారు.

నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు :

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం వైద్య సంస్థలు రిజిస్ట్రేషన్, మౌళిక సదుపాయాలు, సిబ్బంది, పరికరాలు, రికార్డుల నిర్వహణ తదితర కనీస ప్రమాణాలను పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలకు ముందుగా నోటీసులు జారీ చేసి, నిర్దేశిత గడువులోగా లోపాలను సరిదిద్దుకునే అవకాశం కల్పించాలని, గడువు అనంతరం కూడా నిబంధనలు పాటించని సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలును మరింత పటిష్టం చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. నరేందర్, కమిటీ సభ్యులు, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో స్టీల్ ప్లాంట్ కోసం

## ఎస్సార్ గ్రూప్ 18 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 ఒకప్పుడు చిన్న నిర్మాణ సంస్థగా మొదలైన భారతీయ కంపెనీ ఒకటి, ఇప్పుడు అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమైంది. ఆ కంపెనీయే ఎస్సార్ గ్రూప్. శశి రుయా, రవి రుయా అనే ఇద్దరు సోదరులు స్థాపించిన ఈ సంస్థ, అమెరికాలో ఉక్కు రంగంలో సుమారు 18 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 1.4 లక్షల కోట్లు) భారీ పెట్టుబడి పెట్టబోతోంది. ఈ ప్రాజెక్టును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా చరిత్రలోనే అతిపెద్దదిగా అభివర్ణించడం దీని ప్రాధాన్యతను తెలియజేస్తోంది.ఎస్సార్ గ్రూప్ ప్రస్థానం 1969లో చెన్నైలో మొదలైంది. శశి, రవి రుయా సోదరులు తమ తండ్రి నంద్ కిశోర్ రుయా వారసత్వాన్ని అందిపుచ్చుకుని, చెన్నై పోర్టులో ఔటర్ బ్రేక్‌వాటర్ నిర్మాణానికి రూ. 2.5 కోట్ల కాంట్రాక్టుతో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. తమ పేర్లలోని మొదటి అక్షరాలైన 'శ' (శశి), 'ర' (రవి) కలిసొచ్చేలా 'ఎస్సార్' (ఇబబజీతీ) అని కంపెనీకి నామకరణం చేశారు. అక్కడి నుంచి ఈ గ్రూప్ వెనుదిరిగి చూసుకోలేదు. షిప్పింగ్, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్, విద్యుత్, పోర్టులు, టెలికాం వంటి అనేక రంగాల్లోకి విస్తరించి, ప్రపంచవ్యాప్తంగా దూకుడుగా పెట్టుబడులు పెట్టే భారతీయ సంస్థల్లో ఒకటిగా నిలిచింది.సోదరుల్లో పెద్దవాడైన శశి రుయా గ్రూప్ విస్తరణలో కీలక పాత్ర పోషించారు. ఆయన నవంబర్ 2024లో తన 80వ ఏట కన్నుమూశారు. ఇంజనీర్ అయిన చిన్న సోదరుడు రవి రుయా, సంస్థ కార్యకలాపాలను ఏకీకృతం చేయడంతో పాటు అమెరికా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా దేశాలకు వ్యాపారాన్ని విస్తరించడంలో ప్రధాన భూమిక పోషించారు.

రుణాల సంక్షోభం నుంచి పునరుజ్జీవం

భారత ఆర్థిక వ్యవస్థ సరళీకరణ తర్వాత ఎస్సార్ గ్రూప్ వేగంగా విస్తరించినప్పటికీ, అదే స్థాయిలో భారీ అప్పుల్లో కూరుకుపోయింది. ముఖ్యంగా, ఎస్సార్ స్టీల్ ఇండియా దివాలా తీయడంతో, దానిని ఆర్సెలర్ మిట్టల్-నిప్పాన్ స్టీల్ సంస్థకు విక్రయించాల్సి వచ్చింది. అలాగే, ఎస్సార్ ఆయిల్ సంస్థను 12.9 బిలియన్ డాలర్లకు అమ్మివేసి, ఆ వచ్చిన నిధులతో రుణ భారాన్ని గణనీయంగా తగ్గించుకున్నారు.ఈ వ్యూహాత్మక విక్రయాల తర్వాత ఎస్సార్ గ్రూప్ ఇప్పుడు అమెరికాపై దృష్టి సారించింది. ఇప్పటికే మిన్నెసోటాలో 'మెసాబి మెటాలిక్స్' పేరుతో ఇనుప ఖనిజం తవ్వకాలు ప్రారంభించింది. గత 50 ఏళ్లలో అమెరికాలో మొదలైన మొట్టమొదటి కొత్త ఇనుప ఖనిజ గని ఇదే కావడం విశేషం. తాజాగా ప్రకటించిన అయోవా స్టీల్ ప్లాంట్, ఈ మిన్నెసోటా గనుల నుంచి వచ్చే ముడిసరుకును వినియోగించుకోనుంది. ఏటా 10 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. 2030 నాటికి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రవి రుయా కుమారుడు రేవంత్ రుయా, ఇతర కుటుంబ సభ్యులు ఈ కొత్త తరం వ్యాపార కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకుంటూ సంస్థ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com